# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

19.03.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 237 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana







# 2029లోనే జమిలి ఎన్నికలు

## డ్రగ్స్ విషయంలో ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు


మొయినాబాద్ కేసులో ప్రభుత్వ ప్రమేయం లేదు..

- నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్
- ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో రాహుల్ గాంధీ, ఖర్గేలతో భేటీ..
- ఇతర రాష్ట్రాల ఎన్నికల బాధ్యతలపై చర్చ





## ప్రజలకు ప్రముఖుల ఉగాది శుభాకాంక్షలు



03



# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

- మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం
- పేదల ఇళ్లు కూల్చివేత దారుణం
- బఫర్ జోన్ నిర్ణయంలోనూ అస్పష్టత
- అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కేటీఆర్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ వాకౌట్

## డీపీఆర్ లేదు.. ప్రణాళిక లేకుండా ఎలా



**హైదరాబాద్, మార్చి 18:** మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం దాటవేసే ధోరణిలో సమాధానం ఇవ్వడంపై మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు.

మిగతా 2 లో



# తండ్రీకూతుళ్ల సజీవదహనం

- భార్య, మామపై పెట్రోల్ పోసి అల్లుడి దారుణం
- ప్రమాదంగా చిత్రీకరించేందుకు కట్టుకథలు..
- పోలీసుల విచారణలో వీడిన మిస్టరీ

2

# మరో 4 రోజులు వానలు!

- ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో 'ఆరెంజ్ అలర్ట్'
- పిడుగుల ముప్పుపై వాతావరణ శాఖ హెచ్చరిక

2



కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు విస్తరించి ఉన్న వాతావరణ ద్రోణి ప్రభావంతో రాగల నాలుగు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ మరియు రంగారెడ్డి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేసింది.

# ఇరాన్‌పై అమెరికా బాంబుల వర్షం

- 'బంకర్ బస్టర్'లతో భూగర్భ క్షిపణి కేంద్రాల ధ్వంసం
- హర్మూజ్ జలసంధి సమీపంలో బీభత్సం
- ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు
- భగ్గుమంటున్న చమురు ధరలు



4



# ఆర్టీ ఉద్యోగులకు సంస్థ షాక్

- ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్ రద్దు
- ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం

02

# ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

- రాజ్యసభ ఓ ఓ పెన్ యూనివర్సిటీ
- సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం
- రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ
- మాతో ప్రేమాయణం.. మోడీతో అనుబంధం
- దేవేగౌడపై ఖర్గే ఛతురోక్తులు



4


రాజ్యసభ పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం వీడ్కోలు ప్రసంగం చేశారు. పార్లమెంటును ఒక 'ఓపెన్ యూనివర్సిటీ'గా అభివర్ణించిన ఆయన, ఇక్కడ లభించే జ్ఞానం అమూల్యమైనదని కొనియాడారు. పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదని, రాజకీయాల్లో ఎప్పటికీ 'ఫుల్‌స్టాప్' ఉండదని ప్రధాని స్పష్టం చేశారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో, వారి అనుభవాలు దేశ నిర్మాణానికి ఎంతగానో తోడ్పడతాయని ఆయన ఆకాంక్షించారు.

# ఇరాన్‌కు భారత్ ఆపన్నహస్తం

- అత్యవసర వైద్య సామాగ్రి పంపిణీ
- యుద్ధ సంక్షోభంలో మానవతా దృక్పథం..
- సాయం అందినట్లు ఇరాన్ ధ్రువీకరణ

4






# ఆర్టీ ఉద్యోగులకు సంస్థ షాక్

## ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్ రద్దు

**హైదరాబాద్, మార్చి 18:** ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిగ్ షాక్ ఇచ్చింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇకపై ఉద్యోగులు, వారి జీవిత భాగస్వామి.. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నా ఈ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వబోమని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ సర్క్యులర్ జారీ చేసింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద స్పెషల్ క్యాజువల్ లీవ్ మాత్రమే కొనసాగుతుందని తెలిపింది. ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. గతంలో ఈ స్కామ్ ద్వారా కుటుంబ నియంత్రణను ప్రోత్సహించేవారు.

# తండ్రీకూతుళ్ల సజీవదహనం

## నిద్రిస్తున్న భార్య, మామపై పెట్రోల్ పోసి అల్లుడి దారుణం

**హనుమకొండ, మార్చి 18:** క్షణికావేశం, పెరిగిపోయిన కక్ష.. ఒక నిండు కుటుంబాన్ని బూడిద చేశాయి. హనుమకొండ జిల్లా కడిపికొండ రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఒక భీభత్సమైన ఘటనలో తండ్రీకూతుళ్లు సజీవ దహనమయ్యారు. ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంగా నిందితుడు నమ్మించే ప్రయత్నం చేసినప్పటికీ, పోలీసుల చాకచక్యం ముందు అల్లుడి కిరాతకం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. చింతల్‌కు చెందిన ప్రవీణ్‌కు నాలుగేళ్ల క్రితం రాజీవ్ గృహకల్పకు చెందిన రాజశ్రీతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా ప్రవీణ్ ఎలాంటి పనిపాట లేకుండా తిరుగుతుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే రాజశ్రీ తండ్రి రాజశేఖర్ తన కూతురి ఇంటికి వచ్చి అల్లుడి ప్రవర్తనను మందలించాడు. దీనిని అవమానంగా భావించిన ప్రవీణ్, వారిద్దరిపై కక్ష పెంచుకున్నాడు. మంగళవారం రాత్రి భార్య రాజశ్రీ, మామ రాజశేఖర్ గాఢనిద్రలో ఉండగా ప్రవీణ్ వారిపై పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. మంటల్లో చిక్కుకున్న తండ్రీకూతుళ్లు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. తెల్లవారాక ఏమీ తెలియనట్టుగా.. ఇంట్లో అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయని, ప్రమాదంలో భార్య, మామ చనిపోయారని బంధుమిత్రులకు ఫోన్లు చేసి నమ్మించే ప్రయత్నం చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించిన అనంతరం విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. అది ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదం కాదని, పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్యగా పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ప్రవీణ్ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు గుర్తించి, అతడిని అదుపులోకి తీసుకున్నారు. తండ్రీకూతుళ్ల మృతితో రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# మరో 4 రోజులు వానలు!

## ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో 'ఆరెంజ్ అలర్ట్'

**హైదరాబాద్, మార్చి 18:** రాష్ట్రంలో ఎండల తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించినప్పటికీ, అకాల వర్షాలు ఇప్పుడు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు విస్తరించి ఉన్న వాతావరణ ద్రోణి ప్రభావంతో రాగల నాలుగు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ మరియు రంగారెడ్డి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేసింది. రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, వికారాబాద్, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వానలు దంచికొట్టనున్నాయని, ఈ సమయంలో గంటకు 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని అంచనా వేస్తున్నారు. అకాల వర్షాల సమయంలో పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వర్షం పడేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల దగ్గర ఆశ్రయం పొందకూడదని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈదురు గాలుల వల్ల హోర్డింగ్స్, పాత భవనాలు కూలిపోయే ప్రమాదం ఉన్నందున ప్రయాణాల్లో ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం విషయంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కోరింది. ఈ వర్షాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు 3 నుండి 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉంది. ఎండల నుంచి ఉపశమనం లభించినప్పటికీ, ఈ అకాల వర్షాలు ఆస్తి మరియు ప్రాణ నష్టం కలిగించకుండా మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో తగిన చర్యలు ప్రారంభించాయి. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకపోవడమే శ్రేయస్కరమని అధికారులు స్పష్టం చేశారు.

# ప్రజలకు ప్రముఖుల ఉగాది శుభాకాంక్షలు

**హైదరాబాద్, మార్చి 18:** తెలుగు ప్రజలను ప్రముఖులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉభయ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, విపక్ష నేతలు ఉగాది శుభాకాంక్షలు తెలియచేశారు. కొత్త సంవత్సరంలో అంతా శుభం జరగాలని ఆకాంక్షించారు. గవర్నర్లు అబ్దుల్ నజీర్, శుక్లా, సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, విపక్ష నేతలు కెసిఆర్, జగన్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోడీ కూడా తెలుగు ప్రజలకు ఉగాధి శుభాకాంక్షలు తెలియచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నేటినుంచిశ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. గత సంవత్సరం ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా అందరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం అన్నారు.

# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

మొదటి పేజీ తరువాయి

మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంతో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంతో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు



అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ÷వ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్యే ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉంటే వెంటనే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో సొంత జిల్లాలోనే ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి కనీస సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన ప్రణాళిక లేదని, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ లోన్ కూడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీని 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి అప్పగించారని, ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్, భారతదేశంలోని అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. గతంలో ఇదే అసెంబ్లీలో డీపీఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డీపీఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 11న కూడా అదే విషయాన్ని ఏడీబీ మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# 2029లోనే జమిలి ఎన్నికలు

- డ్రగ్స్ విషయంలో ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు
- మొయినాబాద్ కేసులో ప్రభుత్వ ప్రమేయం లేదు..
- నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్
- ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో రాహుల్ గాంధీ, ఖర్గేలతో భేటీ..
- ఇతర రాష్ట్రాల ఎన్నికల బాధ్యతలపై చర్చ



**న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 18:** తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ అసెంబ్లీకి 2028లో ఎన్నికలు రావని, 2029లోనే జమిలి ఎన్నికలు జరుగుతాయని జోస్యం చెప్పారు. ఒకవేళ మహిళా రిజర్వేషన్లు అంతకంటే ముందే అమల్లోకి వస్తే అది స్వాగతించదగ్గ పరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు. సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ప్రభుత్వ జోక్యం ఉందన్న ఆరోపణలను ముఖ్యమంత్రి కొట్టిపారేశారు. ఈ కేసులో టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు స్టేషన్ బెయిల్ రావడం వెనుక ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదని, నిబంధనల ప్రకారమే అది జరిగిందని స్పష్టం చేశారు. "తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే మా లక్ష్యం. మాదకద్రవ్యాల విషయంలో ఎంతటి వారైనా ఉక్కుపాదంతో అణిచివేస్తాం. విచారణ వేగవంతం చేసేందుకే 'సిట్' ఏర్పాటు చేశాం" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ లోపాలను సరిదిద్దుతూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని వివరించారు. పార్లమెంట్ భవనంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను సీఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై వారికి నివేదిక సమర్పించారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని ఈ సందర్భంగా అధిష్ఠానానికి పరిచయం చేశారు. కాగా, పార్లమెంట్ ఆవరణలో ఏపీ మాజీ మంత్రి రోజా, సీఎం రేవంత్ రెడ్డి ఎదురుపడగా, ఇరువురూ పలకరించుకోవడం విశేషం. త్వరలో ఎన్నికలు జరగనున్న తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నట్లు సీఎం తెలిపారు. గతంలో మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో పనిచేసిన అనుభవం ఉన్న తెలంగాణ నేతలకు ఈసారి కూడా కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన రూట్ మ్యాప్‌పై అధిష్ఠానంతో ప్రాథమిక చర్చలు జరిగినట్లు తెలుస్తోంది.

# హార్మ్యూజ్ జలసంధి వద్ద భారీ సైనిక చర్య

- 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రేటర్ బాంబుల ప్రయోగం
- అమెరికా తీరుపై మండిపడుతున్న ఇరాన్

**వాషింగ్టన్, మార్చి 18:** హార్ముజ్ జలసంధిని మళ్లీ ప్రారంభించేందుకు అమెరికా సైన్యం భారీ సైనిక చర్యకు దిగింది. ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న కఠిన రక్షణ గల మిస్సైల్ స్థావరాలపై 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రే టర్ బాంబులను వరుసగా ప్రయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ స్థావరాల్లో ఉన్న యాంటీ షిప్ క్రూజ్ మిస్సైళ్లు హార్ముజ్ మార్గంలో ప్రయాణించే అంతర్జాతీయ నౌకలకు పెద్ద ముప్పుగా మా రినట్లు తెలిపింది. ఈ దాడులతో ఆ ముప్పును నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. అమెరికా ఇజ్రాయెల్ యుద్ధా నికి ప్రతిగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూ సివేయడంతో ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ప్రభావితమైంది. అనేక దేశాలకు చెందిన చమురు నౌకలు అక్కడే నిలి చిపోవడంతో సముద్ర రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ పరిణామాల మధ్య హార్ముజ్ భద్రత కోసం సహకరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్ర దేశాలను కోరినా పెద్దగా స్పందన రాలేదు. నాటో దేశాలు కూడా సైనిక సహాయం విషయంలో వెనుకంజ వేశాయి. 'మేము ఎంతోసహాయం చేసినప్పటికీ మాకు మద్దతు రావడం లేదు' అంటూ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఈ దాడికి దిగినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అణు ఆయుధాల అభివృద్ధి దిశగా తాము సాగుతున్నామన్న అమెరికా ఆరోపణల ను ఇరాన్ ఖండించింది. తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకే పరిమితమ ని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ నెలలుగా ఒత్తిడి తీసుకువస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ యుద్ధని ర్ణయాన్ని ముందుకు నెట్టినట్లు అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. బంకర్ బస్టర్ గా పిలిచే ఈ డీప్ పెనెట్రేటర్ బాంబులు భూమిలో లోతుగా దాగి ఉన్న లేదా బలమైన కాంక్రీట్ నిర్మాణాల్లో ఉన్న లక్ష్యాలను ఛేదించి పేలేలా రూపొందించారు. ఒక్కో బాంబు ధర లక్షల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో అమెరికా మరింత భారీ 30 వేల పౌండ్ల బాంబులను కూడా వినియోగించినప్పటికీ, ప్రస్తుత దాడిలో ఉపయోగించినవి. కీలక లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేసే విధంగా ప్రయోగించినట్లు సమాచారం.

# నగరంలో కల్తీపన్నీర్ తయారీ

## దాడి చేసి పట్టుకున్న అధికారులు

**హైదరాబాద్, మార్చి 18:** కారం, చాయపత్త, పన్నీర్ ఇలా పలు రకాల ఆహార పదార్థాలను పలు రకాల రసాయనాలను ఉపయోగించి కల్తీ ఆహారపదార్థాలను తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు కొందరు కేటుగాళ్లు. ఈజీగా మనీ సంపాదించుకునేందుకు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తాజాగా సికింద్రాబాద్ లోని మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో వేల కిలోల్లో కల్తీ పన్నీర్ బయటపడడంతో అధికారులతో సహా అంతా షాక్ అయ్యారు. కల్తీ పన్నీర్ తయారీ కేంద్రంపై ఫుడ్ ఇన్స్పెక్టర్ తో సహా ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు వేల కిలోలకు పైగా కల్తీ పన్నీర్ ను సీజ్ చేశారు ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు. శ్రీ బాలాజీ డైరీ ప్రొడక్ట్స్, విజయ్ మిల్క్, కర్డ్ షాపు తో సహా ఆరు షాపులపై దాడులు చేశారు. శ్రీ బాలాజీ డైరీ ప్రొడక్ట్స్ లో 1600 కిలోల పన్నీర్ ను సీజ్ చేశారు. విజయ్ మిల్క్ అండ్ కర్డ్ షాప్ లో1000 కిలోల కల్తీ పన్నీర్ సీజ్ చేశారు. నిర్వాహకులు నగరంలో పలు ప్రాంతాల్లో కల్తీ పన్నీరు అమ్ముతున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.





# సీఎస్ పదవీకాలం పొడిగింపు

**హైదరాబాద్, మార్చి 18 :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పదవీ కాలం పొడిగింపుపై గత కొద్దిరోజులుగా సాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఆయన సర్వీసును మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ఉత్తర్వులు అందాయి. తాజా పొడిగింపుతో రామకృష్ణారావు జూన్ నెలాఖరు వరకు తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. వాస్తవానికి రామకృష్ణారావు గతేడాది ఆగస్టు 31నే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే.. రాష్ట్రంలో పాలనాపరమైన అవసరాలు, కీలక ప్రాజెక్టుల అమలు దృష్ట్యా ఆయన సేవలు మరికొంత కాలం అవసరమని భావించిన ప్రభుత్వం, గతంలోనే ఏడు నెలల పొడిగింపు కోరింది. ఆ గడువు ఈ ఏడాది మార్చి 31తో ముగియనుంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కేంద్రానికి విన్నవించగా, సానుకూల స్పందన లభించింది.

# మొయినాబాద్ కేసులో కొత్తకోణం

**మూడు రకాల డ్రగ్స్ వాడినట్లు సిట్ గుర్తింపు**



**హైదరాబాద్, మార్చి 18:** మొయినాబాద్ ఫార్మ్ హౌస్ డ్రగ్స్ కేస్ లో కొత్త కోణం వెలుగు చూసింది. ఫార్మ్ హౌస్ పార్టీలో నిందితులు మూడు రకాల డ్రగ్స్ వాడినట్లు సిట్ బృందం గుర్తించింది. కోకేన్, ఎండిఎంఏ డ్రగ్స్ వాడినట్లు గుర్తించింది. ముఖ్యంగా నమిత్ శర్మ మూడు రకాలు వాడినట్లు నిర్ధారించారు. పైలట్ రోహిత్ రెడ్డి రెండు రకాల డ్రగ్స్ వాడినట్లు అధికారులు తేల్చారు. ఇక అర్జున్ రెడ్డితో పాటు మిగిలిన నిందితులు ఎండిఎంఏతో పాటు మేతోతిపెన్ వాడినట్లు తెలిపారు. పోలీసులు అధిక కిక్ కోసం రోహిత్ నమిత్ శర్మ కాస్ట్లీ మద్యంతో పాటు డ్రగ్స్ కలిపి తీసుకున్నట్లు గుర్తించారు పోలీసులు. పార్టీకి సిమ్లా నుంచి కౌశిక్ డ్రగ్స్ తీసుకొచ్చినట్లు నిర్ధారించారు అధికారులు. అభిషేక్ నుంచి రెండు రకాల డ్రగ్స్ కొనుగోలు చేశాడు. పైలట్ డ్రైవర్ రోహిత్ ఓఆర్ఆర్ దగ్గర కొనుగోలు చేసినట్లు తేల్చారు. అడ్వకేట్ కౌశిక రవి తాను బిజినెస్ ట్రిప్ కోసం సిమ్లాకి వెళ్ళినప్పుడు అక్కడికి గుర్తు తెలిన వ్యక్తుల దగ్గర నుంచి దాదాపు 15,000 రూపాయలు చెల్లించి తీసుకొని వచ్చినట్లుగా పేర్కొన్నారు. అయితే మిగతా డ్రగ్స్ మిగతా రెండు రకాల డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి అనే విషయం తెలుసుకున్నప్పుడు పైలట్ రోహిత్ డ్రైవర్ అయిన శరత్ ఈ రెండు రకాల డ్రగ్స్ తెచ్చినట్లుగా అధికారులు గుర్తించారు.

# రాజాసింగ్‌కు మరోమారు బెదిరింపు లేఖ

**హైదరాబాద్, మార్చి 18 :**గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ప్రాణహాని తలపెట్టేలా బెదిరింపు లేఖ రావడం భాగ్యనగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. గతంలో కూడా ఆయనకు పలుమార్లు అంతర్జాతీయ నంబర్ల నుంచి, సోషల్ మీడియా ద్వారా బెదిరింపులు వచ్చినప్పటికీ, ఈసారి ఈనెల 27 స్పష్టంగా పేర్కొంటూ లేఖ రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 27వ తేదీలోగా రాజాసింగ్‌ను చంపేస్తామంటూ ఆగంతకులు ఆ లేఖలో హెచ్చరించినట్లు సమాచారం. ఇటీవల ఆయన చేసిన ప్రసంగాలతోనే ఈ బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజాసింగ్ చుట్టూ భారీ భద్రత ఉన్నప్పటికీ, ఇలాంటి లేఖలు రావడం ఆయన అనుచరుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ లేఖ అందిన వెంటనే రాజాసింగ్ కార్యాలయ ప్రతినిధులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ లేఖ ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పంపారు? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ నివాసం, ఆయన వెళ్లే ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసే అవకాశం ఉంది.

# ఎస్సై భార్య ఆత్మహత్య



**కరీంనగర్:** కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ భార్య దివ్య (32) ఆత్మహత్యకు పాల్పడ్డారు. నిన్న తన నివాసంలో గన్నేరు పప్పును దంచుకుని సేవించిన ఆమె, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కరీంనగర్ టూ టౌన్ ఎస్సై చంద్రశేఖర్ భార్య దివ్య నిన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గన్నేరు పప్పును మెత్తగా దంచుకుని తాగారు. కొంత సమయానికి ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, వెంటనే స్పందించి ఆమెను కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెను రక్షించేందుకు శతవిధాలా ప్రయత్నించినప్పటికీ.. పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం ఆమె మృతి చెందారు. మృతురాలు దివ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

**అంత్యక్రియల్లో ఉద్రికత్త**

**జమ్మికుంట:** ఎస్సై భార్య అంత్యక్రియల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎస్సై భార్య మంగళవారం రాత్రి ఆత్మహత్యకు చోటు చేసుకోవడంతో మృతి చెందింది. బుధవారం ఆమె అంత్యక్రియలు జరిగే సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ టూ టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు చంద్రశేఖర్. మంగళవారం అతని భార్య సూసైడ్ చేసుకుంది. ఆమె మృతికి కారణం భర్త చంద్రశేఖర్ కారణం అంటూ ఆగ్రహించిన బంధువులు దాడికి ప్రయత్నించారు. దీంతో గ్రామస్తులు, పోలీసులు సకాలంలో జోక్యం చేసుకొని తప్పించారు. ఈ ఘటనతో సీతంపేటలో కొద్ది సేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

# రూ.2400 మద్దతు ధర.. రూ.500 బోనస్

- మక్కలు మార్కెట్లోకి వచ్చిన కొనుగోళ్లు ఏవీ
- ప్రభుత్వ తీరుతో రైతులకు తీవ్రనష్టం
- గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన
- మక్కలు కొనుగోలు చేయాలని డిమాండ్



**హైదరాబాద్, మార్చి 18:** రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ, రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రవణ్, ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. మార్కెట్లకు పోటెత్తిన మక్కలను కొనుగోలు చేయకపోవడంతో రైతన్నకు తిప్పలు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేశారు. మొక్కజొన్నలతో గన్‌పార్క్‌లో నినాదాలు చేసిన గులాబీ పార్టీ నేతలు.. అక్కడి నుంచి కాలినడకన అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వరి వేయొద్దని, పంట మార్పిడి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పదేపదే చెబితే.. ఆ మాటలు నమ్మి రాష్ట్రంలో రైతులు సుమారు 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. తీరా పంట చేతికి వచ్చాక ఆ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతోందని అన్నారు. మొక్కజొన్న మార్కెట్లకు రావడం మొదలై ఇప్పటికే 15 రోజులు అవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ. 2400 ఉంటే.. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు బయట మార్కెట్లో దళారులకు రూ. 1600 నుంచి 1700లకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పదిహేను రోజులుగా కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం చూస్తుంటే ప్రభుత్వ ఆంతర్యం ఏమిటో అర్థమవుతోందని అన్నారు. పంట అంతా దళారుల పాలైన తర్వాత, ఆ దళారుల దగ్గర ఎక్కువ ధరకు కొని వాళ్లకు మేలు చేయాలని ప్రభుత్వం చూస్తోందా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందా? దళారులకు మేలు చేస్తుందా? అనేది స్పష్టం చేయాలన్నారు. ఒకవైపు మద్దతు ధర లేక నష్టపోతుంటే, మరోవైపు అకాల వర్షాలకు మార్కెట్ యార్డుల్లో, కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న తడిచిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. గత రెండు రోజులుగా కురిసిన వడగండ్ల వానలకు మొక్కజొన్న, మామిడి సహా ఇతర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని పేర్కొన్నారు. బ్జడెట్‌లో పంటల బీమా గురించి గొప్పగా ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం అటు పంటల బీమా అమలు చేయదు, ఇటు ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వదని మండిపడ్డారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర రైతాంగానికి ఇన్ పుట్ సబ్సిడీ అందడం లేదని తెలిపారు. ప్రభుత్వం కేవలం మాటల్లో చెబుతున్నదే తప్ప, ఇప్పటివరకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సబ్సిడీ నిధులను విడుదల చేయడం లేదని అన్నారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల జరిగిన నష్టంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వెంటనే నివేదికలు తెప్పించుకోవాలని సూచించారు. తక్షణమే ఎన్యూమరేషన్ చేసి నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేయాలన్నారు. మద్దతు ధర లేకపోవడంతో పాటు వర్షాల కారణంగా అన్నదాతలు నష్టపోతున్నారని తెలిపారు. 25 శాతం పంట.. దళారుల చేతికి వెళ్లిందని అన్నారు. పంటల బీమా అమలు చేయడం లేదని విమర్శించారు. వడగండ్ల వానతో రైతులు నష్టపోయారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదని... వెంటనే ఇవ్వాలన్నారు. రూ. 2400 మద్దతు ధర.. రూ. 500 బోనస్ వెంటనే ప్రభుత్వం చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. మొక్కజొన్న రైతులను కాంగ్రెస్ సర్కార్ ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో మార్షల్స్ దురుసుగా ప్రవర్తించారు. అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద ఎమ్మెల్యేల నుంచి మక్కలు, కందులు లాక్కున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్ హరీశ్‌రావు చేతికి గాయమైంది. గాయం కావడంతో హరీశ్‌రావు చేతి నుంచి రక్తం కూడా వచ్చింది. మరోవైపు అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద పాడి కౌశిక్ రెడ్డి చేతిలో నుంచి చీఫ్ మార్షల్ కరుణాకర్ మక్కలు లాక్కొని కిందపడబోశారు. మార్షల్స్ తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద కూర్చొని నిరసన తెలిపారు. మార్షల్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఐ-ప్యాక్ కార్యాలయంపై ఈడీ దాడులు

**మమత అడ్డుకోవడంపై సుప్రీం సీరియస్**



**న్యూఢిల్లీ,మార్చి18:** కోల్‌కతాలోని ఐ-ప్యాక్ కార్యాలయంపై ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు జరిపిన సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జోక్యం చేసుకోవడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇది హర్షించదగిన పరిణామం కాదని పేర్కొంది. ఇలాంటి అసాధారణ పరిస్థితుల్లో కేంద్ర ఏజెన్సీని ఎలాంటి పరిష్కారం లేకుండా వదిలేయవచ్చా అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. మమతాబెనర్జీ జోక్యంపై ఈడీ వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎన్‌వీ అంజారియాతో కూడిన ధర్మాసనం బుధవారంనాడు విచారణ జరిపింది. 'రేపటి రోజు ఇలాంటి రైడ్స్ జరిగినప్పుడు మరో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటే పరిస్థితి ఏమిటి? ఈడీని ఎలాంటి పరిష్కారం లేకుండా వదిలేయవచ్చా?' అని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. ఎలక్షన్ కన్సల్టెన్సీ ఐ-ప్యాక్ అధిపతి ప్రతీక్ జైన్ నివాసంపై దాడుల సందర్భంగా ముఖ్యమంత్రి చర్యలను ఈడీ తన పిటిషన్‌లో తప్పుపట్టింది. ప్రతీక్ జైన్ నివాసం నుంచి ల్యాప్‌ట్యాప్, ఫోన్, పలు డాక్యుమెంట్లు తీసుకుని ఆమె వెళ్లిపోవడం పూర్తిగా అధికార దుర్వినియోగమే అవుతుందని పేర్కొంది. ముఖ్యమంత్రితో పాటు అమెతో ఉన్న అధికారులపై పోలీసు కేసు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది. కాగా, ఈ కేసు విచారణను మార్చి 24వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. బొగ్గు కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో భాగంగా జనవరి 8న ప్రతీక్ జైన్ కార్యాలయంపై ఈడీ దాడులు జరిపింది. ముఖ్యమంత్రి మమతాబెనర్జీ హుటాహుటిన అక్కడికి రావడం, ఆయన నివాసం నుంచి ఒక ల్యాప్‌టాప్, ఫోన్, పల్గు ÷ళ్లు తీసుకుని వెళ్లిపోవడంతో హైడ్రామా చోటుచేసుకుంది. మమతా బెనర్జీ చర్యలను ఈడీ తప్పుపట్టింది. ముఖ్యమంత్రి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. అయితే ఈడీ దాడులు రాజ్యాంగ విరుద్ధమని మమతా బెనర్జీ తప్పుపట్టారు. అసెంబ్లీ ఎన్నికల వేళ తమ పార్టీ రాజకీయ వ్యూహం, అభ్యర్థుల జాబితా, రహస్య సమాచారాన్ని తెలుసుకునేందుకే ఈడీతో ఈ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. టీఎంసీ పార్టీ హార్డ్‌డిస్క్‌ను తీసుకునేందుకు ఈడీ అధికారులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కాగా, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతలుగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరుగనున్నాయి.

# దమ్ముంటే ఎన్‌కౌంటర్ చేయండి

- పోలీసులకు సవాల్..ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ హతం
- బీహార్ చంపారన్‌లో ఘటన






**పాట్నా, మార్చి 18:** తనను ఎన్‌కౌంటర్ చేసేందుకు ప్లేసు, టైం చెప్పాలంటూ ఒక గ్యాంగ్‌స్టర్ పోలీసులకు సవాల్ విసిరాడు. తర్వాత పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఈ ఘటన బిహార్‌లోని చంపారణ్ జిల్లా మోతిహరి పట్టణ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రాంతంలో కుందన్ ఠాకూర్ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ అనేక నేరాలకు పాల్పడ్డాడు. దీంతో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా ఠాకూర్, అతడి గ్యాంగ్ అజ్ఞాతంలో ఉన్నారు. ఇటీవల ఠాకూర్ పోలీసులకు సవాల్ విసిరాడు. వారిని హెచ్చరిస్తూ ఆడియో సందేశాలు పంపాడు. ముఖ్యంగా చకియా పోలీస్ స్టేషన్ ఆఫీసర్‌కు నేరుగా హెచ్చరికలు జారీ చేశాడు. తనను పట్టుకునేందుకు ఎంత మంది పోలీసులు వచ్చినా వారి అంతుచూస్తానని, దమ్ముంటే ప్లేస్, టైం చెప్పాలంటూ సవాల్ విసిరాడు. తనను ఎన్‌కౌంటర్ చేయాలనుకుంటే ఎందరో పోలీసుల ప్రాణాలు పోతాయని హెచ్చరించాడు. పోలీసులు తన కుటుంబాన్ని వేధిస్తున్నారని, వాటిని ఆపకుంటే తాను కూడా పోలీసుల కుటుంబాల అంతు చూస్తానని వార్నింగ్ ఇచ్చాడు. తాను పారిపోవడం లేదని, ఎన్‌కౌంటర్‌లో ఎంతమంది పోలీసులైనా ఎదుర్కొంటానన్నాడు. ఇది హెచ్చరిక కాదని, సలహా మాత్రమే అని చెప్పుకొచ్చాడు. అయితే, అప్పటికే అతడి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులకు తగిన సమాచారం అందింది. ఠాకూర్, అతడి అనుచరులు ఉన్న ప్రదేశం గురించి సమాచారం అందుకున్న ప్రత్యేక బృందం ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టింది. ఈ క్రమంలో ఠాకూర్ గ్యాంగ్ రెచ్చగొట్టే చర్యలకు దిగింది. దీంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఇరుపక్షాల మధ్య జరిగిన కాల్పుల్లో ఒక ఎస్టీఎఫ్ జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయాడు. తమ సహచరుడు మరణించినప్పటికీ పోలీసులు ఠాకూర్ అండ్ గ్యాంగ్‌కు వ్యతిరేకంగా కాల్పులు జరిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో కుందన్ ఠాకూర్‌తోపాటు మరో ఇద్దరు క్రిమినల్స్ కూడా హతమయ్యారు.

# పాన్‌కార్డుతో ఆధార్ లింక్

**మార్చి 31 వరకు గడువు**

**న్యూఢిల్లీ, మార్చి 18:** కొత్త పాన్ కార్డు పొందాలనుకుంటే దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు కాపీని జత చేస్తే సరిపోతుంది. అయితే రాబోయే ఆర్థిక సంవత్సరం నుంచి అలా కుదరదు. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత కొత్త పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డుతో పాటు అదనపు డాక్యుమెంట్లను కూడా జత చేయాల్సి ఉంటుంది. కేవలం ఆధార్‌తోనే పాన్ పొందాలనుకుంటే మాత్రం మార్చి 31వ తేదీయే తుది గడువు అని కేంద్రానికి చెందిన కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది. బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పాన్ కార్డు అత్యంత కీలకమనే సంగతి తెలిసిందే. ఇప్పటివరకు నూతన పాన్ కార్డు కోసం ఆధార్ కార్డు కాపీ ఇస్తే సరిపోయేది. అయితే ఏప్రిల్ 1 నుంచి ఆధార్‌తో పాటు బర్త్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ వంటి వాటిల్లో ఏదో ఒకటి జత చేయాల్సి ఉంటుంది. ఎప్రిల్ ఒకటి తర్వాత పాత పాన్ దరఖాస్తు ఫారాలను కూడా అనుమతించేది ఉండదని కామన్ సర్వీస్ సెంటర్ పేర్కొంది. ఏప్రిల్ 1 నుంచి పాన్ దరఖాస్తు ఫారాలు కూడా మారతాయని, కొత్తవి అందుబాటులోకి వస్తాయని కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది. అలాగే ఆన్‌లైన్‌లో కొత్త పాన్ కార్డు దరఖాస్తు కోసం బీబితితిబిబ ÷ఔజీని, ఖసనీబిIజీని వెబ్‌సైట్లను సందర్శించాలని పేర్కొంది.






సంపాదకీయం

# కాల గమనం ప్రకృతి పలకరింపు

## 'పరాభవ' ఉగాదికి స్వాగతం!

**కాలం ఒక అప్రతిహత ప్రవాహం. అది ఎక్కడ మొదలైందో, ఎక్కడ ముగుస్తుందో ఎవరికీ ఎరుక లేదు. కానీ, ఆ అనంత కాల గమనాన్ని అంచనా వేస్తూ, ప్రకృతి మార్పులకు అనుగుణంగా మనిషి తన జీవన యానాన్ని క్రమబద్ధీకరించుకున్నాడు. ఆ క్రమంలోనే ఉద్భవించిన అద్భుత పర్వదినం 'ఉగాది'. చైత్ర శుద్ధ పాడ్యమి సూర్యోదయ వేళ బ్రహ్మదేవుడు సృష్టికి అంకురార్పణ చేశాడని పురాణాలు చెబుతుంటే, వసంత లక్ష్మి పచ్చని తోరణాలతో ప్రకృతికి స్వాగతం పలుకుతుంది. ఈ ఏడాది మార్చి 19న అడుగుపెడుతున్న 'శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది' మన సంప్రదాయాలకు, నైతిక విలువలకు మరోసారి అద్దం పడుతోంది.**

### ప్రకృతితో మమేకమైన పండుగ

తెలుగువారి పండుగలన్నీ ప్రకృతితో పెనవేసుకున్నవే. ఉగాది నాటికి వాతావరణంలో వచ్చే మార్పులు మానవ జీవనశైలిని ప్రభావితం చేస్తాయి. మామిడి చిగుళ్లు, కోయిలమ్మ కుహూరావాలు, వేప పూత పరిమళాలు.. ఇవన్నీ కొత్త ఆశలకు సంకేతాలు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, దేశవ్యాప్తంగా వివిధ పేర్లతో–మహారాష్ట్రలో గుడిపాడ్వా, పంజాబ్‌లో వైశాఖీ, తమిళనాడులో పుత్తాండు, కేరళలో విషు–ఈ నూతన సంవత్సరాదిని జరుపుకోవడం మన భారతీయ సంస్కృతిలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెబుతోంది. శాలివాహన చక్రవర్తి పట్టాభిషేకం నుంచి శ్రీరామ చంద్రుని విజయ పరంపర వరకు ఎన్నో చారిత్రక, పౌరాణిక ఘట్టాలు ఈ తిథితో ముడిపడి ఉన్నాయి.


### షడ్రుచుల సందేశం: జీవిత తత్వం

ఉగాది అంటే కేవలం పిండివంటలు, కొత్త బట్టల సంబరం మాత్రమే కాదు; అది ఆత్మపరిశీలనకు ఒక వేదిక. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు–తీపి, చేదు, పులుపు, ఉప్పు, కారం, వొగరు–జీవితంలోని సుఖదుఃఖాలను, జయపజయాలను సమానంగా స్వీకరించాలనే గొప్ప తాత్వికతను బోధిస్తాయి. జీవితం ఎప్పుడూ ఒకే రుచితో సాగదు. కష్టాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, సుఖాలు వచ్చినప్పుడు పొంగిపోకుండా ఉండాలన్నదే ఈ పచ్చడి ఇచ్చే సందేశం. అలాగే పంచాంగ శ్రవణం ద్వారా రాబోయే కాలంలోని ఆదాయ వ్యయాలను, రాజపూజ్య అవమానాలను తెలుసుకోవడం వెనుక ఉన్న ఉద్దేశం.. భవిష్యత్తు సవాళ్లకు సిద్ధపడటం మరియు విజ్ఞతతో వ్యవహరించడమే.

### సామాజిక బాధ్యత - నేటి ఆవశ్యకత

ప్రస్తుత యాంత్రిక జీవనంలో పడి మన మూలాలను మర్చిపోతున్న తరుణంలో, ఉగాది వంటి పండుగలు మనల్ని మన సంస్కృతి వైపు మళ్లిస్తాయి. కాలం ఎవరి కోసమూ ఆగదు, కానీ ఆ కాలంతో పాటు మనం ఎలా మారుతున్నాం, సమాజానికి ఎంత మేలు చేస్తున్నాం అనేదే ముఖ్యం. 'పరాభవ' అంటే గర్వం నశించడం అని కూడా ఒక అర్థం ఉంది. అహంకారాన్ని వీడి, ప్రకృతిని ప్రేమిస్తూ, తోటి మానవుల పట్ల ఆత్మీయతతో మెలగడమే ఈ పండుగ ఇచ్చే నిజమైన లక్ష్యం.

**ప్రకృతి వైపరీత్యాలు, సామాజిక విద్వేషాలు నశించి, వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించడమే ఈ నూతన సంవత్సర సంకల్పం కావాలి. ఈ పరాభవ నామ సంవత్సరం ప్రతి తెలుగు లోగిలిలో ఆయురారోగ్యాలను, సిరిసంపదలను నింపాలని, యువతకు కొత్త ఉపాధి మార్గాలు దొరకాలని కోరుకుంటూ.. లోకమంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆశిద్దాం. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు!**




# ఇరాన్‌పై అమెరికా బాంబుల వర్షం

**వాషింగ్టన్/టెహ్రాన్, మార్చి 18:** మధ్యప్రాచ్యంలో యుద్ధ జ్వాలలు అదుపు తప్పి ఎగిసిపడుతున్నాయి. ఇరాన్ లక్ష్యంగా అమెరికా బలగాలు బుధవారం తెల్లవారుజామున అత్యంత శక్తిమంతమైన వైమానిక దాడులకు దిగాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధి తీరప్రాంతంలో ఉన్న ఇరాన్ భూగర్భ క్షిపణి స్థావరాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. సుమారు 2,268 కిలోల బరువుండే 'బంకర్ బస్టర్' బాంబులను ప్రయోగించి, కాంక్రీట్ కట్టడాలను ఛేదించుకుంటూ వెళ్లి లోపల ఉన్న నౌకా విధ్వంసక క్షిపణులను అమెరికా ధ్వంసం చేసింది. అంతర్జాతీయ నౌకాయానానికి ముప్పు పొంచి ఉందన్న నిఘా వర్గాల సమాచారంతోనే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది.

### ట్రంప్ ఆగ్రహం.. మిత్రదేశాల ముఖం చాటు:

ఈ యుద్ధంలో మిత్రదేశాల నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ వంటి దేశాలు ప్రత్యక్ష పోరాటానికి విముఖత చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. "మాకు ఎవరి సహాయం అవసరం లేదు, ఒంటరిగానే ఇరాన్‌ను ఎదుర్కోగలం" అని ట్రంప్ స్పష్టం చేయడం గమనార్హం. కాగా, ఈ ఘర్షణల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం వాటా కలిగిన





జలసంధి మార్గం దాదాపు మూతపడటంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి.

**'బంకర్ బస్టర్'లతో భూగర్భ క్షిపణి కేంద్రాల ధ్వంసం**
- హర్మూజ్ జలసంధి సమీపంలో బీభత్సం
- ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు
- భగ్గుమంటున్న చమురు ధరలు

### ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులు

అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ తన క్షిపణులను ఇజ్రాయెల్ వైపు మళ్లించింది. ఇజ్రాయెల్‌లోని రామత్ గన్ నగరంపై జరిగిన క్షిపణి దాడిలో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు, ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను యూఏఈ, కువైట్, బహ్రెయిన్ దేశాలు తమ రక్షణ వ్యవస్థలతో అడ్డుకుంటున్నాయి. అమెరికా తన దాడులను ఇరాన్ అణు ప్లాంట్ల సమీపంలోని క్షిపణి కేంద్రాలపైకి మళ్లించడంతో, ఇరాన్ తన అణు కార్యకలాపాలను మరింత వేగవంతం చేసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇది మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# ఇరాన్‌కు భారత్ ఆపన్నహస్తం




- అత్యవసర వైద్య సామాగ్రి పంపిణీ
- యుద్ధ సంక్షోభంలో మానవతా దృక్పథం..
- సాయం అందినట్లు ఇరాన్ ధ్రువీకరణ

**న్యూఢిల్లీ/టెహ్రాన్, మార్చి 18:** అమెరికా–ఇజ్రాయెల్ దాడులతో అతలాకుతలమవుతున్న ఇరాన్‌ను ఆదుకునేందుకు భారత్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చింది. యుద్ధం కారణంగా మందుల కొరతతో అల్లాడుతున్న ఇరాన్ పౌరుల కోసం భారత్ పంపిన తొలి విడత అత్యవసర వైద్య సామాగ్రి బుధవారం ఆ దేశానికి చేరింది. ఈ సహాయాన్ని 'ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ' ప్రతినిధులు అందుకున్నట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించింది. క్లిష్ట సమయంలో అండగా నిలిచిన భారత ప్రభుత్వానికి, ప్రజలకు ఇరాన్ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

### మందుల కొరత.. స్పందించిన విదేశాంగ శాఖ:

ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ లక్ష్యంగా జరుగుతున్న దాడుల వల్ల అక్కడ తీవ్ర మానవతా సంక్షోభం నెలకొంది. వేలాది మంది పౌరులు గాయపడటం, ఆసుపత్రుల్లో ప్రాణ రక్షణ మందులకు తీవ్ర కొరత ఏర్పడటంతో భారత్ తక్షణమే స్పందించింది. భారత విదేశాంగ శాఖ కొద్దిరోజుల క్రితమే ప్రకటించిన విధంగా, ఇరాన్ అధికారులతో జరిపిన చర్చలు ఫలించి ఈ సాయం గమ్యస్థానానికి చేరింది.

"భారత ప్రజలు పంపిన ఈ ఆపన్నహస్తం ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీకి చేరింది. దయార్ద్ర హృదయులైన భారతీయులకు ధన్యవాదాలు" అని న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా పేర్కొంది.

### మిత్ర దేశాల సాయం.. భారతీయుల తరలింపు

భారత్‌తో పాటు చైనా, రష్యా, అజర్‌బైజాన్ వంటి దేశాలు కూడా ఇరాన్‌కు మానవతా సాయాన్ని అందిస్తున్నాయి. మరోవైపు, యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. విదేశాంగ శాఖ నిరంతరం అక్కడి పరిస్థితులను సమీక్షిస్తూ, భారతీయుల భద్రతకు పెద్దపీట వేస్తోంది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నప్పటికీ, మానవతా ప్రాతిపదికన సహాయం అందించడంలో భారత్ తనదైన శైలిని చాటుకుంటోంది.

# ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

- రాజ్యసభ ఓ ఓ పెన్ యూనివర్సిటీ
- సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం
- రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ
- మాతో ప్రేమాయణం..మోడీతో అనుబంధం
- దేవేగౌడపై ఖర్గే ఛతురోక్తులు



**న్యూఢిల్లీ, మార్చి 18(మనసులో మాట):** రాజ్యసభ పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం వీడ్కోలు ప్రసంగం చేశారు. పార్లమెంటును ఒక 'ఓపెన్ యూనివర్సిటీ'గా అభివర్ణించిన ఆయన, ఇక్కడ లభించే జ్ఞానం అమూల్యమైనదని కొనియాడారు. పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదని, రాజకీయాల్లో ఎప్పటికీ 'ఫుల్‌స్టాప్' ఉండదని ప్రధాని స్పష్టం చేశారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో, వారి అనుభవాలు దేశ నిర్మాణానికి ఎంతగానో తోడ్పడతాయని ఆయన ఆకాంక్షించారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతలు తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటుకే అంకితం చేశారని ప్రధాని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వీరి నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని సూచించారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మృదుస్వభావి అని, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే 'ఎవర్‌గ్రీన్' నేత అని ప్రధాని అభివర్ణించారు. ఉభయ సభల ప్రాముఖ్యతను వివరిస్తూ.. ఏదైనా చట్టం ఆమోదం పొందే ముందు 'రెండో అభిప్రాయం' తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుందని మోదీ పేర్కొన్నారు.

### సభలో ఖర్గే చలోక్తులు.. నవ్వుల పువ్వులు

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన ప్రసంగంతో సభలో నవ్వులు పూయించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ఆయన 54 ఏళ్లుగా నాకు తెలుసు. మేమిద్దరం కలిసి పనిచేశాం. కానీ ఏమైందో తెలియదు కానీ, ఆయన మాతో ప్రేమ సాగించి.. చివరకు మోదీని పెళ్లి చేసుకున్నారు" అంటూ చమత్కరించారు. ఈ వ్యాఖ్యలతో ప్రధాని మోదీ సహా సభలోని సభ్యులంతా ఒక్కసారిగా నవ్వుల్లో మునిగిపోయారు. కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేపై కూడా ఖర్గే ఛలోక్తులు విసిరారు. అథవాలే ఎప్పుడూ తన కవితల్లో ప్రధాని మోదీని పొగుడుతుంటారని, ఆయనకు మరే ఇతర కవితలు తెలియవేమో అని ఎద్దేవా చేశారు. శరద్ పవార్, తిరుచ్చి శివ వంటి నేతలతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఖర్గే.. దేశ సేవ చేయాలనే తపన ఉన్నవారు ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని కొనియాడారు. పార్టీ విభేదాలకు అతీతంగా సాగిన ఈ వీడ్కోలు సమావేశం రాజ్యసభ గౌరవాన్ని చాటిచెప్పింది.

# భారత్ వైపు రష్యా చమురు ట్యాంకర్

### అలాంటి సమాచరం లేదన్న కేంద్రం

**న్యూఢిల్లీ,మార్చి18:** చైనాకు చేరుకోవాల్సిన రష్యా చమురు ట్యాంకర్ 'అక్వా టైటాన్' దిశ మార్చుకుని భారత్ వైపు వెళ్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. దక్షిణ చైనా సముద్ర జలాల్లో అది దిశ మార్చుకుందని సమాచారం. అయితే ఆ ట్యాంకర్‌కు సంబంధించి తమ వద్ద ఎలాంటి సమాచారమూ లేదని కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా వెల్లడించారు. జనవరి నెల చివరి వారంలో బాల్టిక్ సీ పోర్ట్‌లో ఈ ట్యాంకర్‌లోకి చమురు లోడ్ అయిందని, ఇది చైనాలోని రిజావో పోర్ట్‌కు చేరుకోవాల్సి ఉందని సమాచారం. అయితే దక్షిణ చైనా సముద్రంలో దిశ మార్చుకున్న ఈ ట్యాంకర్ మార్చి 21వ తేదీ నాటికి కర్ణాటకలోని న్యూ మంగుళూరు పోర్ట్‌కు చేరుకో బోతోందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అంతర్జాతీయ ఇంధన సంక్షోభం నేపథ్యంలో రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ గణనీయంగా పెంచింది. ఈ నేపథ్యంలోనే చైనాకు వెళ్లాల్సిన ఇంధన ట్యాంకర్ భారత్ వైపు మళ్లిందని మీడియాలో కథనాలు వచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు సడలించిన సంగతి తెలిసిందే. దీంతో జపాన్, దక్షిణ కొరియా వంటి పలు దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారీగా పెంచాయి. భారత్ కూడా రష్యా నుంచి చమురు దిగుమతులను పెంచింది. ఆమెరికా ఆంక్షలు సడలించిన తర్వాత రష్యా నుంచి భారత్ రిఫైనరీలు 30 మిలియన్ల బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్టు సమాచారం.



# ఢిల్లీ అగ్నిప్రమాదంలో 9మంది మృతి

### నాలుగు అంతస్థుల భవనం అగ్నికి ఆహుతి

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని పాలెంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటనలో 9 మంది మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రామ్ చౌక్ మార్కెట్‌లో ఉన్న 4 అంతస్తుల భవనంలో ఉదయం 7 గంటలకు అగ్నిప్రమాదం చోటు చేసుకున్నది. ఆ సమయంలో చాలా మంది నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిని ప్రవేశ్, కమాల్, ఆశు, లాడో, హిమాన్షి, దీపికతో పాటు ముగ్గురు మైనర్ బాలికలు ఉన్నారు. అనిల్, సచిన్‌తో పాటు మరో రెండు ఏళ్ల అమ్మాయి గాయపడ్డారు. ఢిల్లీ అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. బిల్డింగ్ ఓనర్‌ను రాజేంద్ర కశ్యప్‌గా గుర్తించారు. కుటుంబసభ్యులు బిల్డింగ్‌లోని రెండో, మూడో ఫ్లోర్లలో నివసిస్తున్నారు. మరణించిన ప్రతి మృతుని కుటుంబానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం రూ. 2 లక్షల చొప్పున ఎక్స్–గ్రేషియా ప్రకటించారు. ఈ దురదృష్టకర సంఘటనపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుండి గాయపడిన వారికి రూ. 50,000 ఎక్స్–గ్రేషియాను ప్రధాని ప్రకటించారు.

# పేదల సేవలో 'కొత్తపల్లి మెమోరియల్ సొసైటీ'



## ఉచిత కంటి ఆపరేషన్లకు 18 మంది తరలింపు

### 9 ఏళ్లుగా వేల మందికి చూపునిచ్చాం: వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్

### వృద్ధులు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం: మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అనిత

**నేటి సాక్షి, కాగజ్‌నగర్:** పేద ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా కొత్తపల్లి వెంకటలక్ష్మి – చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ కొత్తపల్లి అనిత పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ అనిత ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.

#### 18 మందికి ఉచిత శస్త్రచికిత్సలు

గత మంగళవారం నిర్వహించిన శిబిరంలో కంటి శుక్లాల వ్యాధితో బాధపడుతున్న 18 మందిని శస్త్రచికిత్స కోసం ఎంపిక చేశారు. వీరికి సొసైటీ ఖర్చులతోనే రవాణా, భోజన సౌకర్యాలు కల్పించి, మెరుగైన చికిత్స నిమిత్తం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో పంపించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లుగా వేలాది మంది పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామని గుర్తుచేశారు. ఈ అవకాశాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని, లబ్ధి పొందిన వారు మరికొంతమందిని ప్రోత్సహించాలని కోరారు.

#### అండగా లయన్స్ క్లబ్

వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అనిత మాట్లాడుతూ.. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వృద్ధులు అధైర్యపడొద్దని, లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని హామీ ఇచ్చారు. నేడు నిర్వహించిన శిబిరంలో 29 మందికి పరీక్షలు చేయగా, వారిలో మరో 13 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్లు తెలిపారు. త్వరలోనే వారికి కూడా ఆపరేషన్లు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ శ్రీనాథ్, గోపి మరియు కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








నేటి సాక్షి
కరీంనగర్ | గురువారం 19 మార్చి 2026




# కట్నం కోసమే..

## కత్తితో పొడిచి చంపేశాడు!

### మిస్టరీ వీడిన 'యూట్యూబర్ వైష్ణవి హత్య' కేసు.!

**వరకట్న వేధింపులే హత్యకు కారణమని మెట్ పల్లి డీఎస్పీ వెల్లడి**

**యూట్యూబర్ వైష్ణవి దారుణ హత్య కేసులో సంచలన నిజాలు వెలుగులోకి**

### నిద్రలో ఉన్న గర్భిణిపై కత్తితో దాడి.. గొంతు నులిమి హత్య

**ప్రేమ..పెళ్లి.. వరకట్నం.. వేధింపులు.. సాధింపులు.. మర్డర్ ప్లాన్.. చివరికి.. జైలు పాల్!**

నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

"రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'యూట్యూబర్ వైష్ణవి హత్య' కేసు మిస్టరీ వీడింది.! ప్రేమించి.. పెళ్లిచేసుకుని.. గర్భిణీని చేసి.. పురుడుపోసుకోకముందే.. పుట్టింట్లోనే భర్త చేతిలోనే బలైపోయింది.! చివరిసారి తాను ధరించిన 'టీ-షర్ట్'పై ఉన్న 'పహుంచ్ ఉపర్ తక్ హై'..అంటే.! జీవితంలో 'పైకి' ఎదగాలనుకుంది.. కానీ..ఆమె ఎదిగే సమయంలోనే 'పైకే వెళ్లి-పోయింది' ..పాపం వైష్ణవి.! తల్లి మాటలు విన్న కొడుకు.. ప్రాణంగా ప్రేమించిన ప్రియురాలిని భార్యగా మారినంక.. తల్లి కాకముందే 'కట్న పిశాచి'కి కత్తితో బలిచ్చేశాడు.! భార్యను చంపి పరారవుతున్న క్రమంలో పోలీసులు పట్టుకుని .. రిమాండ్ కు పంపించి ఈ ఘటనలో పాల్గొన్న మిగతావారి కోసం గాలిస్తున్నట్టు మెట్ పల్లి డిఎస్పీ రాములు తెలిపారు.."




## వైష్ణవి భర్తే హంతకుడు.!

కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో యూట్యూబర్ గంధం వైష్ణవి (20)ని ఆమె భర్త చిత్తారి హరిబాబు దారుణంగా హత్య చేశాడు. నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవిని తెల్లవారుజామున కత్తితో పొడిచి, గొంతు నులిమి చంపిన హరిబాబు అదనపు రూ.5 లక్షల కట్నం కోసం శారీరక-మానసిక వేధింపులకు గురిచేసి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులు నిర్ధారించారు. ప్రేమ వివాహం తర్వాత కట్నం, యూట్యూబ్ వీడియోల వివాదాలు తీవ్రమై ఈ దుర్ఘటనకు దారితీశాయి. హరిబాబును బుధవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.





### ప్రేమ నుంచి పెళ్లి వరకు..

మాదాపూర్ గ్రామానికి చెందిన గంధం దుర్గాప్రసాద్ కుమార్తె గంధం వైష్ణవి (20) కొంతకాలంగా యూట్యూబ్‌లో వీడియోలు తీసి పేరు తెచ్చుకుంది. సుమారు 10 నెలల క్రితం కోరుట్లకు చెందిన చిత్తారి హరిబాబు తన కుటుంబ సభ్యులతో వివాహం కోసం వచ్చాడు. కట్నం ఇవ్వలేమని వైష్ణవి తల్లిదండ్రులు స్పష్టంగా తెలియజేసినా, ఇద్దరి మధ్య పరిచయం పెరిగి ప్రేమ వివాహం నిర్ణయించుకున్నారు. హరిబాబు తల్లి చిత్తారి లక్ష్మి కట్నం లేకుండా వివాహానికి అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒత్తిడి తీసుకొచ్చేందుకు హరిబాబు విషం సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స తర్వాత కోలుకున్నాక మళ్లీ ఒత్తిడి చేయడంతో, మొదట నిరాకరించిన దుర్గాప్రసాద్ తర్వాత అంగీకరించారు. 29-05-2025న వెంకటాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం వారు వైష్ణవి తల్లిదండ్రుల ఇంట్లోనే నివసించారు.

### కట్నం కోసం వేధింపులు, శారీరక-మానసిక హింస

కొంతకాలం తర్వాత హరిబాబు రూ.5 లక్షల కట్నం కోరాడు. దుర్గాప్రసాద్ మొత్తం ఇచ్చి మాదాపూర్ గ్రామంలో రెండు గుంటల భూమిని కూడా కొనుగోలు చేసి ఇచ్చారు. అయినప్పటికీ అదనంగా మరో రూ.5 లక్షలు కోరుతూ వైష్ణవిని మానసికంగా, శారీరకంగా వేధించాడు. హరిబాబు తల్లి లక్ష్మి, అన్నలు ఆనంద్, అశోక్ కూడా ఈ వేధింపులకు ప్రేరేపించినట్లు ఆరోపణలు వచ్చాయి. సుమారు మూడు నెలల క్రితం వైష్ణవి గర్భవతిగా మారినా వేధింపులు కొనసాగాయి. గత కొంతకాలంగా వరకట్నం కోసం హరిబాబు వైష్ణవిని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని, దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని మెట్ పల్లి డీఎస్పీ రాములు మీడియాతో తెలిపారు.






### భార్యను చంపేసి..బైక్ పై పరారై..

తేదీ 16-03-2026 రాత్రి 11:00 గంటల సమయంలో వైష్ణవి, హరిబాబు తమ గదిలో నిద్రకు వెళ్లారు. తెల్లవారుజామున 4:00 గంటల సమయంలో శబ్దాలు, అరుపులు వినిపించాయి. తలుపు తట్టినా తీయకపోవడంతో తిరిగి వెళ్లారు. నిద్రలో ఉన్న వైష్ణవిపై హరిబాబు కత్తితో దాడి చేసి, గొంతు నులిమి హత్య చేశాడు. నుదుటిపై గాయాలు, మెడపై గుర్తులు ఉన్నాయి. తేదీ 17-03-2026 ఉదయం 6:00 గంటలకు హరిబాబు ఒంటరిగా బయటకు వచ్చి ముఖం కడుక్కుని..తనకు కట్నంగా ఇచ్చిన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ (టీజీ 21 ఏ 8026)పై ఎవరికీ తెలియకుండా



ఇంట్లోంచి వెళ్లిపోయాడు. గది తెరిచి చూడగా వైష్ణవి మంచం పక్కన రక్తపు మడుగులో పడి ఉంది. తక్షణమే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు ప్రకటించినట్టు పోలీసులు పేర్కొన్నారు.

### హంతకుడు పరారీ, అరెస్టు

హత్య అనంతరం హరిబాబు రాయికల్ మైతాపూర్ ప్రాంతంలో తిరిగి, కోనరావుపేట ఎక్స్ రోడ్డు సమీపంలో ఖాళీ డబుల్ బెడ్ రూమ్ ఇంటి మెట్ల కింద కత్తి, రక్తపు మచ్చలున్న దుస్తులను దాచాడు. సాయంత్రం 18:30 గంటల సమయంలో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఒప్పంద ప్రకటనలో అదనపు కట్నం కోసమే హత్య చేశానని అంగీకరించినట్టు వివరించారు.డీఎస్పీ రాములు, సీఐ సురేశ్‌బాబు, ఎస్సై చిరంజీవి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నారు.

### ఏకైక కుమార్తె వైష్ణవికి 15 మంది అన్నదమ్ములు

వైష్ణవి తన వంశంలో ఏకైక ఆడ సంతానం. ఆమెకు 15 మంది అన్నలు ఉన్నారు.తన తల్లికి ఏడుగురు తోడబుట్టిన అక్కాచెల్లెళు ..అంతమంది అన్నలు ఉండి కూడా ఆమెను కాపాడలేకపోవడం దురదృష్టకరమని కుటుంబ సభ్యులు వ్యాఖ్యానించారు. ఆస్తి కోసమే ప్రేమించి పెళ్లి చేసుకుని గర్భవతిని చేసిన భర్త హరిబాబే దారుణంగా హతమార్చాడని ఆరోపిస్తున్నారు. హరిబాబు, అతని కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.!

### యూట్యూబర్‌గా ఎదిగి.. విషాదాంతం

'ఝఅంష్త్రబ॰ూఎఝ' పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహించిన వైష్ణవి, తక్కువ కాలంలోనే వేలాది మంది అభిమానులను సంపాదించింది. కుటుంబ జీవితం, సరదా వీడియోలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.నిన్నటి వరకు వీడియోల్లో కనిపించిన ఆ నవ్వు... ఈరోజు శాశ్వతంగా మాయమవ్వడం ఆమె అభిమానులను కలచివేస్తోంది.

**ప్రేమతో మొదలైన ఈ బంధం.. వరకట్నం, అనుమానాలు, అహంకారం మధ్య చీలిపోయి చివరకు ఒక గర్భిణి ప్రాణాన్ని బలి తీసుకుంది. ఒక క్షణికావేశం.. రెండు ప్రాణాలు.. ఒక కుటుంబాన్ని శాశ్వత చీకటిలోకి నెట్టేసింది. కోరుట్లలో చోటుచేసుకున్న ఈ ఘటన, మానవ సంబంధాల విలువను మరోసారి ప్రశ్నిస్తోంది.!**



### యూట్యూబ్ వీడియోల వివాదం

వైష్ణవి భర్తతో చాలా వీడియోలు తీసి అప్‌లోడ్ చేసింది. హరికి మరొకరితో అఫైర్ ఉందంటూ ఇంట్లో పంచాయతీ పెట్టినట్లు వీడియోలు క్రియేట్ చేశారు. వీడియోల విషయంలోనే గొడవలు జరిగాయని అనుమానాలు వ్యక్తమయ్యాయి. వైష్ణవిని వీడియోలు చేయొద్దని హరిబాబు హెచ్చరించాడు. వ్యూస్ కోసం ఇలాంటి వివాదాస్పద వీడియోలు చేశారా.?లేక భర్త తప్పులను ఎత్తిచూపేందుకా అనేది స్పష్టత లేదు.!సోషల్ మీడియా వీడియోల వివాదమే హత్యకు కారణమని కూడా కొందరు చర్చించుకుంటున్నారు.





# అమ్మకానికి ఆర్సీబీ

## 16 వేల కోట్లకు పోటీ.. స్వీడన్ సంస్థ ఈక్విటీ భారీ బిడ్

## రాజస్థాన్ రాయల్స్‌పై కూడా.. మార్చి 31 నాటికి తేలనున్న

## ఐపీఎల్ ఫ్రాంచైజీల అమ్మకాలు

**బెంగళూరు:** ఐపీఎల్లో 2025 చాంపియన్‌గా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ అమ్మకం ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. స్వీడన్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఈక్యూటీ భారీ బిడ్ పెట్టినట్లు సమాచారం. మరోవైపు మణిపాల్ హాస్పిటల్స్ అధినేత రంజన్‌పై, అమెరికా సంస్థ కేకేఆర్, సింగపూర్ ఇన్వెస్ట్మెంట్ గ్రూప్ టెమాసెక్ కలసిన కన్సార్టియం కూడా పోటీలో ఉంది. మొత్తం డీల్ విలువ సుమారు 2 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని అంచనా. ప్రారంభంలో మాంచెస్టర్ యునైటెడ్ సహ యజమానులు గ్లేజర్స్, అదార్ పూనావాలా కూడా ఆసక్తి చూపినప్పటికీ చివరికి రేసు నుంచి తప్పుకున్నారు. గ్లేజర్స్ సుమారు 1.8 బిలియన్ డాలర్ల నాన్ బైండింగ్ ఆఫర్ ఇచ్చినట్లు, అయితే 6 ఈక్యూటీ దాన్ని దాటేలా బిడ్ పెంచినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ డీల్ సూటిగా బిడ్డింగ్ పోరుగా మారింది. దయాజియో గ్రూప్ మార్చి 31ని గడువుగా పెట్టి ఈ అమ్మకాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇదే సమయంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీకి కూడా భారీ ఆసక్తి కనిపిస్తోంది. మూడు సంస్థలు బైండింగ్ బిడ్లు సమర్పించినట్లు తెలుస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఫేవరెట్‌గా నిలుస్తోంది. మొదట మెజారిటీ వాటా అమ్మాలని భావించిన రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఇప్పుడు పూర్తి విక్రయానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

# ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్‌గా ఇషాన్

- కమిన్స్ వచ్చే వరకు బాధ్యతలు..
- సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు కెప్టెన్ మార్పు..




**ఢిల్లీ:** ఐపీఎల్-2026 సీజన్ రణరంగం మొదలవ్వకముందే సన్‌రైజర్స్ హైదరాబాద్ శిబిరంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. జట్టును విజయపథంలో నడిపిస్తాడనుకున్న స్టార్ ప్లేయర్, రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్‌కు వెన్నునొప్పి గాయంతో ఆయన ఈ సీజన్ ఆరంభ మ్యాచులకు దూరం కానున్నారు. ఈ క్లిష్ట సమయంలో జట్టు పగ్గాలను ఎవరికి అప్పగించాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించిన మేనేజ్‌మెంట్, చివరకు యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ వైపు మొగ్గు చూపింది.

### ఆరెంజ్ ఆర్మీకి కొత్త బాస్..

మెగా వేలంలో భారీ ధరకు దక్కించుకున్న ఇషాన్ కిషన్‌పై ఉన్న నమ్మకంతో యాజమాన్యం అతడిని తాత్కాలిక కెప్టెన్‌గా ప్రకటించింది. కిషన్ దూకుడైన బ్యాటింగ్ శైలికి తోడు, వికెట్ల వెనుక ఉండి గేమ్ ప్లాన్ చేయగల సామర్థ్యం అతడికి ప్లస్ పాయింట్ కానుంది. కమిన్స్ పూర్తిగా కోలుకుని ఫిట్‌నెస్ సాధించే వరకు ఇషాన్ కిషనే సన్‌రైజర్స్‌ను నడిపిస్తారు. కెప్టెన్సీ మార్పుతో పాటు వైస్ కెప్టెన్‌గా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మను నియమించడం మరో విశేషం. గత కొన్ని సీజన్లుగా ఎస్ఆర్‌హెచ్ తరపున అద్భుత ప్రదర్శన చేస్తున్న అభిషేక్, ఇషాన్ కిషన్‌కు చేదోడు వాదోడుగా ఉండనున్నారు. ఇద్దరు యువ ఆటగాళ్లకు కీలక బాధ్యతలు ఇవ్వడం ద్వారా జట్టులో కొత్త ఉత్సాహం నింపాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

### కమిన్స్ పరిస్థితి ఏమిటి..?

ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న పాట్ కమిన్స్, అక్కడ వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. గాయం తీవ్రత దృష్ట్యా అతను విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. కోలుకున్న వెంటనే అతను భారత్‌కు చేరుకుని జట్టులో చేరతారని.. అప్పటివరకు కోచ్ డేనియల్ వెట్టోరి ఆధ్వర్యంలో ఇషాన్ బృందం వ్యూహాలకు పదును పెడుతుందని సమాచారం. ఈ నెల 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగే హై-వోల్టేజ్ మ్యాచ్‌తో సన్‌రైజర్స్ తన ప్రస్థానాన్ని ప్రారంభించనుంది. ఇషాన్ కిషన్ నాయకత్వంలో ఆరెంజ్ ఆర్మీ ఏ మేరకు రాణిస్తుందో, తన కెప్టెన్సీ మార్కును ఎలా చూపిస్తాడో అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అనుభవజ్ఞుడైన కమిన్స్ లేకపోవడం జట్టుకు లోటే అయినప్పటికీ, యువ జోడీ ఏ రకమైన మ్యాజిక్ చేస్తుందో వేచి చూడాలి.

# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

## టీమిండియా టాప్ షో..

- టాప్-5లో ముగ్గురు భారత బ్యాటర్లు!
- రెండో స్థానంలో విరాట్ కోహ్లీ.. రోహిత్, గిల్‌కు చోటు
- మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన అగ్రస్థానం




**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు మరోసారి తమ సత్తా చాటారు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో టాప్-5లో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు సంపాదించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా వివిధ జట్లు ఆడుతున్న సిరీస్‌ల ఆధారంగా ఈ ర్యాంకింగ్స్‌ను ఐసీసీ ఖరారు చేసింది.

### బ్యాటింగ్ విభాగం: కోహ్లీ జోరు

వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, భారత రన్ మెషిన్ విరాట్ కోహ్లీ రెండో స్థానంలో నిలిచారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రాహీం జద్రాన్ మూడో స్థానంలో ఉండగా.. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో స్థానాన్ని, యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఐదో స్థానాన్ని దక్కించుకున్నారు. టాప్-5లో ముగ్గురు భారతీయులే ఉండటం అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది.

### బౌలింగ్ అండ్ఆల్‌రౌండర్లు: ఆఫ్ఘన్ హవా

బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ నంబర్ 1 స్థానంలో నిలిచారు. జోఫ్రా ఆర్చర్ (ఇంగ్లాండ్), కేశవ్ మహారాజ్ (దక్షిణాఫ్రికా), బెర్నార్డ్ స్కోల్జ్ (నమీబియా), ఆదిల్ రషీద్ (ఇంగ్లాండ్) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ ఆఫ్ఘన్ ప్లేయర్ల హవా కొనసాగింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ అగ్రస్థానంలో నిలవగా, సికందర్ రజా (జింబాబ్వే), మహ్మద్ నబీ (ఆఫ్ఘన్), మెహిదీ హసన్ మిరాజ్ (బంగ్లాదేశ్), రషీద్ ఖాన్ (ఆఫ్ఘన్) టాప్-5లో నిలిచారు.

### మహిళల విభాగం: స్మృతి మంధాన నంబర్ 1

మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. నాట్ స్కివర్-బ్రంట్ (ఇంగ్లాండ్), బెత్ మూనీ (ఆస్ట్రేలియా), లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా) తర్వాతి స్థానాల్లో ఉండగా.. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐదో స్థానంలో నిలిచారు. మొత్తంగా పురుషుల, మహిళల విభాగాల్లో భారత ఆటగాళ్లు నిలకడైన ప్రదర్శనతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తమ ముద్ర వేస్తున్నారు.

# జడేజా కాళ్లు మొక్కిన స్టార్ స్పిన్నర్ కుల్దీప్

## లక్నోలో ఘనంగా వెడ్డింగ్ రిసెప్షన్!

## వింటేజ్ 'రోల్స్ రాయిస్' కార్లో నూతన వధూవరుల గ్రాండ్ ఎంట్రీ

## హాజరైన సీఎం యోగి, అఖిలేష్ యాదవ్, గౌతమ్ గంభీర్, రిషబ్ పంత్

**లక్నో, మార్చి 18:** భారత స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ వైవాహిక జీవితంలో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించారు. తన చిన్ననాటి స్నేహితురాలు వంశిక చద్దాతో గత వారం ముస్సోరీలో వివాహం చేసుకున్న కుల్దీప్, మంగళవారం రాత్రి లక్నోలోని 'ది సెంట్రమ్' హోటల్‌లో అత్యంత వైభవంగా వెడ్డింగ్ రిసెప్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు క్రీడా, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు భారీగా తరలివచ్చారు.

### గురువుకు తగ్గ శిష్యుడు: వైరల్ వీడియో

ఈ వేడుకలో ఒక అద్భుతమైన దృశ్యం క్రికెట్ అభిమానుల మనసు గెలుచుకుంది. టీమిండియా సీనియర్ ఆల్రౌండర్ రవీంద్ర జడేజా తన భార్య రివాబాతో కలిసి ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ క్రమంలో కుల్దీప్-వంశిక జంట జడేజా దంపతుల కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. మైదానంలో స్పిన్ ద్వయంగా ఆకట్టుకునే వీరు, బయట కూడా సీనియర్ల పట్ల కుల్దీప్ చూపిన గౌరవం నెట్టింట వైరల్ అవుతోంది. రివాబా ఎంతో ఆప్యాయంగా నూతన జంటను దీవించిన తీరు అందరినీ ఆకట్టుకుంది.

### తరలివచ్చిన దిగ్గజాలు:

ఈ రిసెప్షన్ వేడుకకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వికెట్ కీపర్ రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్, శిఖర్ ధావన్, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, యూపీ అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానా తదితరులు పాల్గొని సందడి చేశారు.

### రాజసం ఉట్టిపడేలా ఎంట్రీ:

రిసెప్షన్ వేదిక వద్దకు కుల్దీప్ దంపతులు వింటేజ్ 'రోల్స్ రాయిస్' కార్లో గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చారు. కుల్దీప్ నలుపు రంగు సూట్‌లో స్టైలిష్‌గా కనిపించగా, వంశిక క్రీమ్ కలర్ చీరలో మెరిసిపోయారు. 31 ఏళ్ల ఈ చైనామన్ స్పిన్నర్ తన వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టిన సందర్భంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సహచర క్రికెటర్లు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు

- అగ్రస్థానం 'కింగ్'దే, టాప్-10లో అందరూ దిగ్గజాలే!
- బ్యాటర్లకు స్వర్గధామంగా ఐపీఎల్
- ప్రతి సీజన్‌లో భారీ స్కోర్లు, రికార్డుల వర్షం



**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్‌లో బ్యాటర్లకు స్వర్గధామంగా భావించబడుతుంది. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా.. ప్రతి బ్యాటర్ విరుచుకుపడుతుంటాడు. ఈ క్రమంలో ప్రతి సీజన్‌లో భారీ స్కోర్లు, రికార్డుల వర్షం కురుస్తుంటాయి. మరికొన్ని రోజుల్లో ఐపీఎల్ 2026 ఆరంభం కానుంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాను ఓసారి చూద్దాం. ఇప్పటి వరకు జరిగిన సీజన్లను పరిశీలిస్తే.. టాప్-10లో నిలిచిన ఆటగాళ్లు అందరూ దిగ్గజాలే ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా టీమిండియా స్టార్ బ్యాటర్, రికార్డుల కింగ్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో ఉన్నాడు. కింగ్ 267 మ్యాచ్‌ల్లో 8661 పరుగులు చేశాడు. రన్ మెషీన్‌గా పేరొందిన కోహ్లీ నిరంతర ప్రదర్శనతో ఈ రికార్డును నెలకొల్పాడు. రెండో స్థానంలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నాడు. హిట్‌మ్యాన్ 272 మ్యాచ్‌లలో 7046 పరుగులు చేశాడు. మూడో స్థానంలో భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ నిలిచాడు. గబ్బర్ 222 మ్యాచ్‌ల్లో 6769 రన్స్ బాదాడు. ధావన్ తన స్థిరమైన ఆట శైలి ఐపీఎల్‌లో టాప్ బ్యాటర్లలో ఒకరిగా నిలబెట్టింది. నాలుగో స్థానంలో ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఉన్నాడు. 184 మ్యాచ్‌లలో 6565 పరుగులు చేశాడు. ఐదో స్థానంలో మిస్టర్ ఐపీఎల్ సురేష్ రైనా (205 మ్యాచ్‌ల్లో 5528) పరుగులతో నిలిచాడు. రైనా ఐపీఎల్‌లో అత్యంత స్థిరమైన బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందాడు. ఆరవ స్థానంలో మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఉన్నాడు. మహీ 278 మ్యాచ్‌లలో 5383 పరుగులు చేశాడు. తన ఫినిషింగ్ స్టైల్‌తో మ్యాచ్‌లను మలుపుతిప్పే ధోనీ ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఏడో స్థానంలో దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ (5162) ఉన్నాడు. అతని వినూత్న షాట్లు అభిమానులను ఎప్పటికీ అలరిస్తాయి. కేఎల్ రాహుల్ (5054), క్రిస్ గేల్ (4965), రాబిన్ ఉతప్ప (4952)లు టాప్-10 జాబితాలో ఉన్నారు.





# సంతృప్తిగా ఉన్నా

## రాశీ ఖన్నా

“చిత్ర పరిశ్రమలో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా, ఈ 13 ఏళ్ల ప్రయాణంలో వైవిధ్యమైన పాత్రలతో ఈ స్థాయికి చేరుకోవడం చాలా సంతోషంగా ఉంది” అని ప్రముఖ కథానాయిక రాశీ ఖన్నా అన్నారు. పవన్ కల్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రం ఈ నెల 19న విడుదలవుతున్న సందర్భంగా ఆమె మీడియాతో ముచ్చటించారు. ఈ సినిమాలో తను ‘శ్లోక’ అనే మోడ్రన్ అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, ఇందులో ఒక మాస్ సాంగ్‌లో డ్యాన్స్ చేయడం చాలా ఎంజాయ్ చేశానని ఆమె తెలిపారు. ఉగాది కానుకగా వస్తున్న ఈ చిత్రం పూర్తి వినోదాత్మకంగా ఉంటుందని, కుటుంబమంతా కలిసి చూడొచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం తన చేతిలో ఉన్న ప్రాజెక్టుల గురించి చెబుతూ.. హిందీలో అక్షయ్ కుమార్‌తో ఒక సినిమా, పాపులర్ వెబ్ సిరీస్ ‘ఫర్జీ 2’ చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే అమెజాన్ సిరీస్‌లో పంజాబీ పోలీస్ క్యారెక్టర్‌లో కనిపిస్తానని, తమిళంలో ‘రౌడీ అండ్ కో’ చిత్రంతో పాటు తెలుగులో మరికొన్ని కొత్త కథలు వింటున్నట్లు రాశీ ఖన్నా వివరించారు. తన కెరీర్ గ్రాఫ్ చూసుకుంటే గర్వంగా ఉందని, ప్రేక్షకుల ఆదరణే తనను ఇక్కడి వరకు తీసుకువచ్చిందని ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



# ఒత్తిడికి చెక్ పెట్టాలంటే..

మూడు దశాబ్దాలుగా తన అందం, ఫిట్‌నెస్‌తో కుర్రకారును అలరిస్తున్న బాలీవుడ్ భామ శిల్పా శెట్టి, తన నిత్య యవ్వనానికి గల రహస్యాన్ని మరోసారి పంచుకున్నారు. నిరంతరం షూటింగ్‌లు, వృత్తిపరమైన ఒత్తిళ్లతో బిజీగా ఉండే తాను, పని మొదలుపెట్టే ముందు ప్రశాంతంగా ఉండటానికి ‘ప్రాణాయామం’ పాటిస్తానని ఆమె వెల్లడించారు. తాజాగా గోల్డ్ హాల్టర్-నెక్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోతూ, ఆహ్లాదకరమైన వాతావరణంలో శ్వాస వ్యాయామం చేస్తున్న వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మనసును ఏకాగ్రతతో ఉంచడానికి, ఒత్తిడిని దూరం చేయడానికి యోగా, ప్రాణాయామం మించిన మార్గం లేదని ఆమె పేర్కొన్నారు. 1993లో ‘బాజీగర్’ చిత్రంతో వెండితెర అరంగేట్రం చేసిన శిల్పా, నేటికీ అదే ఫిజిక్‌ను కాపాడుకుంటూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వారమంతా కఠినమైన ఆహార నియమాలు పాటించే ఆమె, ఆదివారం మాత్రం ‘సండే బింజ్’ పేరుతో తనకు ఇష్టమైన పదార్థాలను ఆస్వాదిస్తూ లైఫ్ అంటే బ్యాలెన్స్ అని నిరూపిస్తుంటారు. ప్రస్తుతం సినిమాలతో పాటు ‘ఇండియాస్ గాట్ టాలెంట్’ వంటి రియాలిటీ షోలకు జడ్జిగా వ్యవహరిస్తున్న శిల్పా.. కుటుంబ బాధ్యతలు, కెరీర్‌ను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఫిట్‌గా ఉండాలనుకునే వారు కనీసం ప్రాణాయామంతోనైనా తమ రోజును ప్రారంభించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.



# ఆ స్టార్ హీరో నన్ను రిజెక్ట్ చేశాడు

దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు తెరకెక్కించిన ‘ఝుమ్మంది నాదం’ చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై, ప్రస్తుతం బాలీవుడ్ టాప్ హీరోయిన్లలో ఒకరిగా రాణిస్తున్న తాప్సీ పన్ను సంచలన వ్యాఖ్యలు చేశారు. టాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా వెలిగి, ఆ తర్వాత హిందీ చిత్రసీమకు మకాం మార్చిన ఈమె, అక్కడ వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, తన కెరీర్ ప్రయాణంలో ఎదురైన కొన్ని చేదు అనుభవాలను తాప్సీ తాజాగా పంచుకున్నారు. హీరోయిన్లకు ఎక్కువ పేరు వచ్చే సినిమాల్లో నటించేందుకు చాలా మంది స్టార్ హీరోలు ఇష్టపడరని, ఆ కారణంతోనే ఒక స్టార్ హీరో తనను రిజెక్ట్ చేశాడని ఆమె బాంబు పేల్చారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, అమితాబ్ బచ్చన్‌తో ‘పింక్’, షారుఖ్ ఖాన్‌తో ‘డంకీ’ వంటి భారీ చిత్రాల్లో నటించిన తాప్సీ, బాలీవుడ్‌లో ‘ఫైర్ బ్రాండ్’గా పేరు తెచ్చుకున్నారు. లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తున్నప్పుడు కొందరు హీరోలు తమ పాత్రల ప్రాధాన్యత తగ్గిపోతుందనే భయంతో హీరోయిన్లను మార్పించాలని చూస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తెలుగులో వరుస హిట్లతో కెరీర్ ప్రారంభించిన తాప్సీ, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై కూడా సత్తా చాటుతూ వరుస ప్రాజెక్టులతో బిజీగా గడుపుతున్నారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# గ్రామీణ వికాసానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట



- గ్రామీణ వికాసానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట
- తూంకుంట నర్సారెడ్డి

**నేటి సాక్షి, గజ్వేల్:** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గిర్మాపూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ చిట్కుల విజయలక్ష్మితో కలిసి ఆయన మురికి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి ప్రభుత్వం మొదటి విడతలో రూ. 5.41 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వంటి చారిత్రాత్మక నిర్ణయాలను ప్రభుత్వం అమలు చేస్తోందని నర్సారెడ్డి వివరించారు. రైతు సంక్షేమం కోసం రూ. 2 లక్షల రుణమాఫీతో పాటు, సన్నధాన్యానికి రూ. 500 బోనస్ అందిస్తున్నామని, మరో నాలుగు రోజుల్లో రైతు భరోసా నిధులు నేరుగా అన్నదాతల ఖాతాల్లో జమ అవుతాయని వెల్లడించారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని, విద్య, వైద్యం, రవాణా రంగాలను ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కీసరి వెంకటేష్ మరియు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మృత్యుపాశంలా చిత్తనూర్ విత్తనాల కంపెనీ

- రెండో దశ పనులపై ప్రజల ఆగ్రహం



**నేటి సాక్షి, నారాయణపేట :** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని చిత్తనూర్ విత్తనాల కంపెనీ (ఇథనాల్ ప్లాంట్) పరిసర గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో వెలిసిన ఈ కంపెనీ వల్ల ఇప్పటికే వాతావరణం కలుషితమై రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో, రెండో దశ కంపెనీ ప్రారంభానికి ఏర్పాట్లు జరగడంపై స్థానికులు విలవిలలాడుతున్నారు. చిత్తనూరు, కనుమనూరు, కుమ్మరి లింగంపల్లి, ఏక్లాస్పూర్, మరికల్ తదితర గ్రామాల ప్రజలు ఈ ప్రాజెక్టును తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఈ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడిన వందలాది మంది రైతులు, మేధావులపై పోలీసులు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపిన ఉదంతాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం నడుస్తున్న మొదటి దశ కంపెనీ నుంచే వెలువడుతున్న దుర్వాసన, విషవాయువుల వల్ల పసిపిల్లలు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారని, పశుపక్షాదులు సైతం ప్రాణాలు కోల్పోతున్నాయని విద్యావంతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం 45 రోజుల్లో రెండో దశ ప్రారంభమైతే పరిస్థితి మరింత భయానకంగా మారుతుందని వారు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, ఈ కంపెనీల కోసం జూరాల ప్రాజెక్టు నుండి భారీగా నీటిని మళ్లించడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొదటి దశకే 1.5 టీఎంసీల నీరు వాడుతుండగా, రెండో దశకు కూడా అంతే మొత్తంలో నీరు అవసరమవుతుందని మేధావులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయని, ఆదాయం కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం సరికాదని ఐక్యవేదిక గొంతెత్తుతోంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి, చిత్తనూర్ నుండి ఈ కంపెనీని తక్షణమే ఎత్తివేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# మరికల్‌లో 'ప్రజాపాలన ప్రగతి' వైద్య శిబిరం





**నేటి సాక్షి, నారాయణపేట :** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతి' వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి (ఐవీఎా) జయచంద్ర మోహన్ సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని సౌకర్యాలు, మందుల నిల్వలు మరియు వైద్య సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ వైద్య శిబిరానికి మరికల్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వివిధ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మరికల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాఘవేందర్ రెడ్డి, డాక్టర్ హిమజ, రేవంత్ రాజ్, నరేందర్, నవీన్ కుమార్, సునీల్ కుమార్, రాకేష్ మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఇలాంటి శిబిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# పోషకాహార అవగాహనకు 'ఫ్రూట్ సలాడ్' తయారీ




- అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేసి, వారి సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి,సిఐటియు డిమాండ్

**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ :** కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మరియు పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఈకో క్లబ్ మరియు వృక్షశాస్త్ర విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ 'ఫ్రూట్ సలాడ్ తయారీ' కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ.. నిత్యం తాజా పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయని, తద్వారా పర్యావరణ అనుకూల మరియు సుస్థిర జీవనశైలిని అలవర్చుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. సహజంగా లభించే పండ్ల ద్వారా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో ఈకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ దేవేందర్ రెడ్డి వీరమల్ల వివరించారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ వివిధ రకాల ఫ్రూట్ సలాడ్‌లను తయారు చేసి, వాటిలోని పోషక విలువల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. లక్ష్మినరసింహం, అధ్యాపకులు డాక్టర్ ఇ. శారద, డి. జనార్దన్, ఎం. రాజేశ్వర్, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ టి. దత్తాత్రేయ, నరసింగరావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై పాడి పశువుల పంపిణీ

## దరఖాస్తుల ఆహ్వానం

**నేటి సాక్షి, ఎండపల్లి:** జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి పథకం (SCAP 2025-26) కింద పాడి పశువుల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి వెల్గటూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గ రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం భారీ సబ్సిడీని అందిస్తోంది. ఈ పథకం కింద ఒక్కో యూనిట్ విలువ రూ. 2 లక్షలు కాగా, అందులో 80 శాతం అంటే రూ. 1.60 లక్షలను ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుంది. మిగిలిన 20 శాతం (రూ. 40 వేలు) మాత్రమే లబ్ధిదారులు బ్యాంక్ రుణంగా పొందాల్సి ఉంటుంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా ఎస్సీ కులానికి చెందినవారై ఉండాలని, గత ఐదేళ్లలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎటువంటి సబ్సిడీ పొంది ఉండకూడదని అధికారులు స్పష్టం చేశారు. కనీసం 10 గుంటల భూమి కలిగి ఉండటంతో పాటు, బ్యాంక్ నుండి 20 శాతం రుణానికి సంబంధించిన సమ్మతి పత్రం (జశీఅంవత్ ాావ్వతీ) సమర్పించాల్సి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు మరియు పట్టాదారు పాస్□బుక్ నకళ్లతో తమ దరఖాస్తులను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అందజేయాలి. మొదటి విడత దరఖాస్తులకు మార్చి 25 మరియు రెండవ విడతకు ఏప్రిల్ 10, 2026 చివరి తేదీలుగా నిర్ణయించారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# మానస దేవి ఆలయానికి ఆర్టీసీ బస్సులు నడపాలి

## సంపతి ఉదయ్ కుమార్



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలం ఖాసీంపేట గ్రామంలోని శ్రీ స్వయంభూ మానస దేవి ఆలయానికి వివిధ ప్రాంతాల నుండి ఆర్టీసీ బస్సులు నడపాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. వరంగల్, హుజురాబాద్, హుస్నాబాద్ నుండి గుండ్లపల్లి, జంగాపల్లి, గన్నేరువరం మీదుగా ఖాసీంపేట వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. వేసవి సెలవుల దృష్ట్యా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో వస్తారని, వారి సౌకర్యార్థం వెంటనే బస్సులు వేయాలని ఆయన కోరారు. ఈ విషయమై త్వరలోనే సంబంధిత ఆర్టీసీ డిపో మేనేజర్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు ఉదయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# అసోం రైఫిల్స్ శిక్షణ కేంద్రం

## గన్నేరువరంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చిత్ర మిశ్రా



**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వ స్థలాన్ని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా పరిశీలించారు. అసోం రైఫల్ రెజిమెంట్ ( బి.స్.ఫ్) శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిబంధనల మేరకు గన్నేరువరం మండల కేంద్రంలో సర్వే నం.179 ప్రభుత్వ భూమి స్థలాన్ని పరిశీలించామని కలెక్టర్ పేర్కొన్నారు. వీరి వెంట అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, కరీంనగర్ ఆర్డివో కె. మహేశ్వర్, తహశీల్దార్ కె.కనకయ్య, మండల సర్వేయర్ గారాలు వున్నారు

# చందాపూర్ పాఠశాలలో ముందస్తు ఉగాది



**నేటి సాక్షి తొగుట. (వడ్డే నరసింహులు):** సిద్దిపేట జిల్లా, తొగుట మండలం చందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా ముందస్తు పరాభవ నామ సంవత్సర ఉగాది సంబరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను మామిడి ఆకుల తోరణాలతో అలంకరించి, షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని విద్యార్థినీ విద్యార్థులకు అందించడం జరిగింది. తరువాత విద్యార్థులు పండితుల వేషధారణలో పంచాంగ శ్రవణం నిర్వహించుకోవడం ద్వారా పండగ వాతావరణం తలపించేలా కార్యక్రమం నిర్వహించుకోవడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు గరిపల్లి సిద్దేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రాంబాబు, రాజలింగం, అరుణశ్రీ, గంగా, గీత, అఖిల మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ బోనాలు



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మక్తపల్లె గ్రామంలో బుధవారం ఘనంగా పోచమ్మకు బోనాలు సమర్పించారు. సర్పంచ్ గాండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని, డప్పు చప్పుళ్లతో నడుమ ఆలయానికి బయలుదేరారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాండ్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మరికల్ పశు వైద్యశాల స్థలం పరిశీలన

- కబ్జా ఆరోపణలపై రెవెన్యూ అధికారుల విచారణ



**నేటి సాక్షి, నారాయణపేట:** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాల స్థలం కబ్జాకు గురైందని వచ్చిన ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు బుధవారం స్పందించారు. పశు వైద్యశాల స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించారంటూ మరికల్ మండల బీజేపీ నాయకులు గతంలో అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ నేపథ్యంలో, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) సుధాకర్ రెడ్డి, సర్వే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సదరు స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే నంబర్ల వారీగా స్థల విస్తీర్ణం, హద్దులను తనిఖీ చేసిన అధికారులు, ఫిర్యాదులోని అంశాలను నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. పశు వైద్యశాల స్థల పరిస్థితిపై సమగ్ర నివేదికను రూపొందిస్తున్నామని, దీనిని తక్షణమే మండల తహసీల్దార్‌కు అందజేస్తామని తెలిపారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు అధికారులు కట్టుబడి ఉండాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీశైలంలో ఎక్సైజ్ శాఖ మెరుపు దాడులు

- భారీగా అక్రమ మద్యం పట్టివేత



**నేటి సాక్షి, శ్రీశైలం:** శ్రీశైలంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాల నేపథ్యంలో అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై నంద్యాల జిల్లా ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపింది. అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి. రాముడు నేతృత్వంలో బుధవారం దేవస్థాన పరిసర ప్రాంతాలైన కొత్తపేట, మేకలబండ, మాణిక్యమ్మసేల ప్రాంతాల్లో ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారిపై మూడు కేసులు నమోదు చేశారు. అరెస్టయిన వారి నుంచి ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 60 మద్యం సీసాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఉగాది బ్రహ్మోత్సవాల వేళ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతరం నిఘా ఉంచుతామని హెచ్చరించారు. అక్రమ మద్యం తయారీ, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఆత్మకూరు సిఐ మోహన్ రెడ్డి, ఆళ్లగడ్డ సిఐ విజయ్ కుమార్, ఈఎస్టీఎఫ్ సిఐ లక్ష్మణదాస్ మరియు వివిధ ప్రాంతాలకు చెందిన ఎస్ఐలు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాదిక్ పాషా భౌతికకాయానికి బీఆర్ఎస్ నేతల నివాళి



**నేటి సాక్షి, ములుగు :** గోవిందరావుపేట మండలం పసర గ్రామానికి చెందిన అజీజ్ పాషా సోదరుడు సాదిక్ పాషా అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు సూచన మేరకు పలువురు సీనియర్ నాయకులు సాదిక్ పాషా నివాసానికి చేరుకుని, ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల అధ్యక్షులు నరసింహ నాయక్, జిల్లా సీనియర్ నాయకులు పోరిక గోవింద నాయక్, తాటి కృష్ణయ్య, మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే వెలిశాల సరూప, కొమరం ధనలక్ష్మి, తాటికొండ శ్రీనివాస్, సిద్ధంశెట్టి లక్ష్మణరావు, యలవర్తి శ్రీనివాసరావు, లకావత్ చందులాల్, పోరిక విజయరామ్, ఏలకుల ధనంజయ్ మరియు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు సాదిక్ పాషా మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



- మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా


**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ :** కాగజ్ నగర్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పి.ఆర్.టి.యు (మహిళా విభాగం) తెలంగాణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా మాట్లాడుతూ.. మహిళలు కేవలం గృహానికే పరిమితం కాకుండా రాజకీయ, క్రీడా మరియు అంతరిక్ష రంగాలలో తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని, వారి హక్కులను కాపాడుతూ సమానత్వం సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా ఉపాధ్యాయునిగా మహిళలు సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యురాలు డాక్టర్ రుక్మిణి మరియు పలువురు మహిళా నాయకులను PRTU ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తమను గౌరవించినందుకు PRTU రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కటుకం మధుకర్, జిల్లా అధ్యక్షులు శ్యాం సుందర్ మరియు ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతిలకు మహిళా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.టి.యు మహిళా నాయకులు గాయత్రి, రజియా సుల్తానా, సుమిత్ర, పూర్ణిమ, ఉమారాణి, ఝాన్సీ, మాధవి మరియు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ముస్లింలకు ఇఫ్తార్ విందు

### మంత్రి అడ్లూరి హాజరు

**నేటి సాక్షి, ఎండపల్లి:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. రాజారాంపల్లి లోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేయనున్న ఈ విందుకు ముఖ్య అతిథిగా ధర్మపురి ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మంత్రి ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. సామాజిక ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి ఏటా ఈ ఇఫ్తార్ విందులను అధికారికంగా నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొననున్నారు. వేడుకకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## హుస్సేన్ నాయక్ తండ్రి మృతి



**నేటి సాక్షి, మహబూబాబాద్ :** గూడూరు మండలం తార్యా తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ గారి తండ్రి, ప్రముఖ సామాజిక కార్యకర్త జాటోత్ లచ్చ నాయక్ బుధవారం కన్నుమూశారు. తండా ప్రజల సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేస్తూ, అందరితో ఆప్యాయంగా ఉండేవారిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన మరణవార్త తెలియగానే తార్యా తండాకు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, బంధువులు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. లచ్చ నాయక్ భౌతిక కాయానికి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యా నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, నాయకులు బోడ పృథ్వీరాజ్, ధారావత్ వెంకన్న, గుగులోత్ నందులాల్, బానోతు దాము నాయక్, మాలోతు సురేష్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లచ్చ నాయక్ మరణం తండాకే కాక ఉమ్మడి జిల్లాకు తీరని లోటు అని పేర్కొన్నారు. హుస్సేన్ నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

## గ్రామ అభివృద్ధియే ధ్యేయం

### సర్పంచ్ బొల్లికొండ జయరాజు



**నేటి సాక్షి, అనంతగిరి :** గ్రామ అభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకుని వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెంకట్రామాపురం సర్పంచ్ బొల్లికొండ జయరాజు తెలిపారు. మండల పరిధిలోని వెంకట్రామాపురం గ్రామంలో బుధవారం ఆయన మహిళా సంఘం భవన నిర్మాణంతో పాటు పదో వార్డులోని ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని, స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిల సహకారంతో రూ. 10 లక్షల వ్యయంతో మహిళా సంఘం భవనాన్ని, అలాగే రూ. 5 లక్షల వ్యయంతో రామ్ రెడ్డి పాలెం ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్డు పనులను చేపట్టామని ఆయన వివరించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, ఉపసర్పంచ్ చల్ల కోటయ్య, 10వ వార్డు మెంబర్ పర్వతం కవిత శ్రీను, గ్రామ పెద్దలు అమరనేని వేదాంతరావు, వేనేపల్లి దామోదర్ రావు, హర్ష, బాలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యకే పరిమితం కాదు

### ప్రిన్సిపాల్ రజిత



**నేటి సాక్షి, మంచిర్యాల:** పాఠశాల అనేది కేవలం పుస్తక జ్ఞానాన్ని అందించే వేదిక మాత్రమే కాదని, పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నైతిక విలువలు, మానవత్వం, ఐక్యత మరియు సనాతన ధర్మాన్ని బోధించే పవిత్ర స్థలమని వాగ్దేవి ప్రైమరీ పాఠశాల ప్రిన్సిపాల్ రజిత పేర్కొన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఉగాది పండుగ విశిష్టతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు అన్ని మతాల పండుగలు, ముఖ్యంగా ఉగాది, రంజాన్, క్రిస్మస్ వంటి వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉగాది పండుగను ఎందుకు, ఎప్పుడు జరుపుకుంటారో వివరంగా వివరించారు. కాలాచక్రం ప్రకారం తెలుగు నెలలు, సంవత్సరాల గణనను వివరిస్తూ.. ఉగాది ఏ ప్రాతిపదికన వస్తుందో పిల్లలకు అవగాహన కల్పించారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం చిన్ననాటి నుంచే అలవాటు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదిగ జాగృతి సంఘం ఏకగ్రీవ ఎన్నిక



**నేటి సాక్షి అనంతగిరి:** మండల పరిధిలోని పాలవరం గ్రామంలో బుధవారం మండల మాదిగ జాగృతి ఆధ్వర్యం పాలవరం మాదిగ జాగృతి సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా మాదాసు బాబు, మదాసు వెంకటరత్నం, మాదిగ జాగృతి సంఘం అధ్యక్షుడిగా మదాసు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా మాదాసు నాగేంద్రబాబు, కార్యదర్శులుగా మాతంగి వినయ్ కుమార్ ,మాదాసు వీరబాబు,మదాసు మనోహర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా మాతంగి నరేష్, కలకొండ సైదులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ..ప్రతి ఊరికి ప్రతి గుండెకు ప్రతి గడపకు మాదిగ జాగృతి సంఘాలు ఉంటాయి అని,మన చరిత్రలు మన ఆచారాలు తెలుసుకొని మాదిగ జాగృతి సంఘం బలోపేతానికి కార్యకర్త కృషి చేస్తారని అన్నారు. సంఘానికి ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా అన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ..మాదిగ జాగృతి కి అహర్నిషలు కష్టపడతానని, మన సంఘం కట్టుబడులకు ఉంటారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చిన్నం ఇర్మియా, కొత్తపల్లి ఉపేంద్ర,మాదాసు అంజయ్య,మాతంగి రాజు,వీరయ్య, రాములు, జిల్లేపల్లి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం బీభత్సం

**నేలపాలైన మామిడి కాయలు.. కన్నీరుమున్నీరవుతున్న రైతులు**



**నేటి సాక్షి, నారాయణపేట:** నారాయణపేట జిల్లాలో ఒక్కసారిగా కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులు మామిడి రైతులను కోలుకోలేని దెబ్బ తీశాయి. జిల్లాలోని మరికల్, ధన్వాడ మండలాల్లో భారీగా వీచిన గాలులకు మామిడి తోటల్లో కాయలు పెద్ద ఎత్తున నేలరాలాయి. మరికల్ మండల కేంద్రానికి చెందిన రైతు శరత్‌కు చెందిన సుమారు 20 ఎకరాల మామిడి తోటలో కాయలు రాలిపోవడంతో భారీ నష్టం వాటిల్లింది. ఎంతో ఖర్చు చేసి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి ప్రకోపానికి గురికావడంపై సదరు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ధన్వాడ మండల కేంద్రంలో రైతు వైద్యనాథ్ లింగంకు చెందిన 10 ఎకరాల మామిడి తోటలో కూడా ఈదురు గాలుల వల్ల పంటకు తీవ్ర నష్టం జరిగింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 40 ఎకరాలకు పైగా మామిడి తోటలు దెబ్బతిన్నట్లు సమాచారం. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన తమను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వివిధ రైతు సంఘాల నాయకులు కూడా స్పందిస్తూ.. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి, బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# గంగమ్మ ఆలయ వేలంపాట

**రూ. 34.47 లక్షల ఆదాయం**



**నేటి సాక్షి, చౌడేపల్లి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ పరిధిలోని వివిధ వనరులకు బుధవారం నిర్వహించిన వేలంపాట ద్వారా దేవస్థానానికి రూ. 34.47 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ ఏకాంబరం తెలిపారు. కొండపై గల నాలుగు రకాల విక్రయ హక్కుల కోసం బహిరంగ వేలం నిర్వహించగా, వ్యాపారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా కొండపైన క్యాంటీన్, ఐస్‌క్రీమ్‌లు, కూల్ డ్రింక్స్ ఏడాది పాటు విక్రయించుకునే హక్కును సోమశేఖర్ రూ. 24.50 లక్షలకు దక్కించుకున్నారు. అదేవిధంగా, కొండ కింద విక్రయాల హక్కును హరిబాబు రూ. 7.51 లక్షలకు, భక్తుల పాదరక్షలు భద్రపరిచే హక్కును సుధాకర్ నాయుడు రూ. 2.46 లక్షలకు అత్యధిక ధరకు పాడి సొంతం చేసుకున్నారు. పారదర్శకంగా జరిగిన ఈ వేలం ప్రక్రియలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శశి కుమార్, ఆలయ అర్చకులు మరియు అధికార సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి ఈ ఆదాయం ఎంతగానో దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# ఆత్రం సమ్మక్క హత్య కేసు నిందితులను ఉరి తీయాలి



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్:** పెంచికల్ పేట మండలం కొండపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం హత్యకు గురైన ఆదివాసి యువతి ఆత్రం సమ్మక్క కుటుంబాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కూషన రాజన్న, ఆదివాసి గిరిజన సంఘం (గూ+టూ) ప్రతినిధులు బుధవారం పరామర్శించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల నుంచి హత్యకు సంబంధించిన వివరాలను సేకరించిన నాయకులు, ఈ దారుణ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రేమ పేరుతో మోసగించి, ఏడు నెలల గర్భవతి అని కూడా చూడకుండా సమ్మక్కను అంతం చేయడం అత్యంత హేయమైన చర్య అని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో ఆదివాసీలు, మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, నిందితులకు కఠిన శిక్షలు పడకపోవడమే ఇందుకు కారణమని ఆరోపించారు. సమ్మక్కను హత్య చేసిన కేర్కర్ జలపతితో పాటు అతనికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిని రెండు హత్యల కేసుగా (గర్భస్థ శిశువుతో కలిపి) మరియు కిడ్నాప్ కేసుగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ. 25 లక్షల ఎక్స్[illegible]గ్రేషియా, ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును పకడ్బందీగా అమలు చేయాలని, జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి భరోసా కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముంజం ఆనంద్ కుమార్, నెర్పల్లి అశోక్, కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ '420' హామీలను వెంటనే అమలు చేయాలి

- **వికారాబాద్‌లో బీజేపీ నిరసన**



**నేటి సాక్షి, వికారాబాద్:** రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు బుధవారం వికారాబాద్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను మరియు 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎంఆర్ఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, కేవలం ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా పాలన సాగుతోందని నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక సమస్యలపై స్పందిస్తూ.. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని, కమిషన్ల కోసమే రోడ్డు పనులను జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా మరియు మూసీ ప్రక్షాళన పేరుతో పేద ప్రజల ఇళ్లను కూల్చి వారిని రోడ్డున పడేస్తున్నారని, అదే బఫర్ జోన్‌లో ఉన్న ఓవైసీ కళాశాల వంటి పెద్ద నిర్మాణాలను ఎందుకు ముట్టుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఉప అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు జగన్, గోపాల్ రెడ్డి, రవి, లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి మరియు బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుకు దక్కని మద్దతు ధర

- **దళారుల చేతిలో అన్నదాత విలవిల**



**నేటి సాక్షి, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండలం మంగళ్ తండాలో మొక్కజొన్న రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఆకాశాన్ని అంటే పెట్టుబడులతో పంట పండించిన రైతులకు, తీరా చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేక కన్నీళ్లే మిగులుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో, రైతులకు మరో మార్గం లేక దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకున్న మధ్యవర్తులు క్వింటాల్‌కు కేవలం రూ. 1600 నుండి రూ. 1700 మాత్రమే చెల్లిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన రైతు జాటోత్ వీరన్న వంటి పలువురు రైతులు తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదని వాపోతున్నారు. ఒకవైపు మార్కెట్‌లో దోపిడీ జరుగుతుంటే, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానకు కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంటలు నేలమట్టమయ్యాయి. అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడులు కూడా వెనక్కి వచ్చే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు ఆర్థికంగా కుంగిపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, కనీస మద్దతు ధరకు పంటను సేకరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

# బీసీ గ్యారంటీలను అమలు చేయాలి

- **మంచిర్యాలలో లక్ష సంతకాల సేకరణ**
- **కాంగ్రెస్ మేనిఫెస్టోలోని బీసీ డిక్లరేషన్ అంశాలపై హక్కుల పోరాట సమితి సమరం**
- **బీసీ సబ్ ప్లాన్, రిజర్వేషన్లు మరియు రూ. లక్ష కోట్ల బడ్జెట్ కేటాయింపుపై డిమాండ్**
- **అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా హామీలు నెరవేర్చలేదని నాయకుల ధ్వజం**




**నేటి సాక్షి, మంచిర్యాల:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన బీసీ అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలో లక్ష సంతకాల సేకరణ ఉద్యమాన్ని బుధవారం ప్రారంభించారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ముల్కల అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా గత మూడేళ్లుగా నెరవేర్చలేదని మండిపడ్డారు. తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే మహాత్మా జ్యోతిబాపూలే చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని, సివిల్ కన్‌స్ట్రక్షన్ పనుల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి ఇప్పుడు విస్మరించారని వారు ధ్వజమెత్తారు. ఉన్నత విద్య కోసం రూ. 10 లక్షల ఆర్థిక సాయం, ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టడం వంటి అనేక కీలక హామీలు బుట్టదాఖలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఓట్ల కోసమే బీసీ అంశాలను మేనిఫెస్టోలో చేర్చారని, ఇచ్చిన మాట ప్రకారం ఐదేళ్లలో లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ సంతకాల సేకరణను రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు గుమ్మల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజెల్లి వెంకటయ్య, శాఖపూరి భీమ్సేన్, వేముల అశోక్, కీర్తి రవి, రామగిరి రాజన్న చారి మరియు ధర్మాజీ సాయి తదితరులు పాల్గొన్నారు.

# సుబ్లేడును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం



- సర్పంచ్ స్వాతి సుమన్ రెడ్డి
- ప్రజా ప్రభుత్వ ప్రగతి ప్రణాళికలో భాగంగా ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి

**నేటి సాక్షి, తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని సుబ్లేడు గ్రామంలో పారిశుద్ధ్య పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సర్పంచ్ సంఘబత్తుల స్వాతి సుమన్ రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో మంచినీటి సరఫరా, సైడ్ కాలవల శుభ్రత మరియు మౌలిక వసతుల కల్పనలో రాజీ లేకుండా పనులు చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఎప్పటి నుంచో పేరుకుపోయిన మురుగు కాలవలను శుభ్రం చేయించి, పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి సహకారంతో గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సర్పంచ్ తెలిపారు. త్వరలోనే సుబ్లేడును జిల్లాలోనే ఒక ఆదర్శ గ్రామ పంచాయతీగా నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి పగడాల రాజకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి రూపాయిని గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని, రానున్న రోజుల్లో సుబ్లేడులో మరిన్ని సానుకూల మార్పులు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కామారెడ్డికి కాదు... రాజాసింగ్‌పై పోటీ చేయాల్సింది



- కేసీఆర్‌పై షబ్బీర్ అలీ ఎద్దేవా"
- మైనార్టీలకు న్యాయం చేసింది కాంగ్రెస్ కేసీఆర్ పాలనపై షబ్బీర్ అలీ తీవ్ర విమర్శలు

**నేటి సాక్షి గజ్వేల్ :** రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ, వారిని అణగదొక్కింది మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలోని పాలన అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ తీవ్రంగా విమర్శించారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేయడం కంటే, బీజేపీ నేత రాజా సింగ్ పై పోటీ చేసి ఉంటే మరింత సముచితంగా ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరైన షబ్బీర్ అలీ, ఈ సందర్భంగా మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మైనార్టీలకు ఆశించిన మేర ప్రయోజనాలు అందలేదన్నారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ముఖ్యంగా దివంగత నేత వైయస్సార్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మైనార్టీ సంక్షేమానికి ప్రాధాన్యత పెరిగిందని, ప్రభుత్వ చర్యల వల్ల పరోక్షంగా సుమారు 9 శాతం వరకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. మైనార్టీల అభ్యున్నతికి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, మైనార్టీ గురుకులాల విస్తరణ, పేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు, యువతకు ఉద్యోగావకాశాల కల్పనపై చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. అదేవిధంగా 'షాదీ ముబారక్' వంటి పథకాల ద్వారా పేద మైనార్టీ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తూ, వారి జీవనోపాధిని మెరుగుపరచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. సబ్సిడీ ఆధారిత పథకాల అమలు, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు కూడా సమర్థంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా మజీద్ కమిటీ సభ్యులు తమ ప్రాంత సమస్యలను వివరించి వినతి పత్రం సమర్పించారు. ముఖ్యంగా కబ్రస్తాన్ ఏర్పాటుకు స్థలం కేటాయింపు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధుల మంజూరు వంటి అంశాలను ప్రస్తావించారు.

వినతిపై స్పందించిన షబ్బీర్ అలీ, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని తెలిపారు.

# నందికొట్కూరులో 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభం



- దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం.. కూటమి ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయం
- లబ్ధిదారులతో కలిసి కర్నూలు వరకు బస్సులో ప్రయాణించిన శాసనసభ్యులు



**నేటి సాక్షి, నందికొట్కూరు:** దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన "దివ్యాంగ శక్తి" పథకాన్ని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే స్వయంగా దివ్యాంగ సోదర సోదరీమణులతో కలిసి నందికొట్కూరు నుండి కర్నూలు వరకు బస్సులో ప్రయాణించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగుల ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, వారిలో స్వావలంబన పెంపొందించేందుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఇలాంటి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, సంగినేల రమణ, జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు మీనాక్షి దేవి, కూటమి నాయకులు మరియు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# నారాయణపేటలో ఇఫ్తార్ విందు

## పాల్గొన్న జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని జామా మసీద్ మరియు హాజికన్ పేట్ మజీద్‌ల వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేసి, వారితో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముస్లింలు జరుపుకునే పండుగలలో రంజాన్ మాసం ఎంతో విశిష్టమైనదని, భక్తిశ్రద్ధలకు మారుపేరని కొనియాడారు. ఈ పవిత్ర నెలలో ముస్లిం సోదరులు కఠినమైన ఉపవాస దీక్షలు పాటిస్తూ క్రమశిక్షణతో ప్రార్థనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నారాయణపేట జిల్లా ప్రజలందరూ కుల, మత భేదాలకు అతీతంగా సోదరభావంతో పండుగలను జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొంటూ, ముస్లిం సోదరులందరికీ ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్, అమీరుద్దీన్, దస్తగిరి చాంద్, కాంగ్రెస్ నాయకులు తఖీ, ముస్లిం మత పెద్దలు మరియు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు టీకాలు



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలంలోని అంబారిపేట గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీంట్లో 69 ఆవులు, ఎద్దులు, 54 గేదెలు కలిపి మొత్తం 123 పశువులకు సిబ్బంది టీకాలు వేశారు. పశువుల్లో వేగంగా వ్యాపించే గాలికుంటు వ్యాధిని నివారించడానికి ప్రభుత్వం చేపడుతున్న ఈ టీకా కార్యక్రమం రైతులకు ఎంతో మేలు చేస్తుందని అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దర్శనాల నరేష్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి రైతు తమ పశువులకు సమయానికి టీకాలు వేయించుకోవాలని, ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉప సర్పంచ్ దుర్గం శ్రీకాంత్ కూడా రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశు వైద్య సిబ్బంది ఎస్.రాజేందర్, జి. నవీన్, పులి లక్ష్మి, కె. కుమారస్వామి పాల్గొని పశువులకు టీకాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు బి.అంజయ్య, ఎండి అజ్జు, బక్కయ్య, ఎం.కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేశవాపురం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తా

## సర్పంచ్ ఈదుల మహేష్



**నేటి సాక్షి, తిరుమలాయపాలెం, మెట్టు రుద్రరాజు:** కేశవాపురం గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతన సర్పంచ్ ఈదుల మహేష్ అన్నారు. బుధవారం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిండిప్రోలు నుండి విడిపోయి నూతన పంచాయతీగా ఏర్పడిన కేశవాపురం గత పాలకవర్గ హయాంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలో ఇప్పటికే పురవీధులు, మురుగు కాలువల శుభ్రత పనులను వేగవంతం చేశామని, అయితే కొందరు ఇంటి యజమానులు కాలువల శుభ్రతకు సహకరించకపోవడం శోచనీయమన్నారు. గ్రామ శుభ్రత కోసం ప్రతి ఒక్కరూ పాలకవర్గానికి సహకరించాలని ఆయన కోరారు. గ్రామంలో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రావణి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ ఆటంకాలు సృష్టించకుండా నూతన పాలకవర్గానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

## సదానందం చారి భౌతిక కాయాన్ని సందర్శించిన నాయుడు



**నేటి సాక్షి, జోగులాంబ గద్వాల:** కేటిదొడ్డి మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, గంగన్ పల్లి గ్రామానికి చెందిన సదానందం చారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల బాసు హనుమంతు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిన్న సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారన్న విషయం తెలుసుకున్న హనుమంతు నాయుడు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి చేరుకుని సదానందం చారి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాజుల కృష్ణ రెడ్డి, చక్రధర్ రావు, కౌన్సిలర్ భర్త కమ్మరి రాము, వెంకటేష్ నాయుడు, ఇద్దుం గోవిందు, గోవిందు, చంద్రశేఖర్, ప్రహ్లాద్, రాముడు, పరుశరాములు, కృష్ణ, శేఖర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో ఘనంగా అన్నప్రసాద వితరణ

'అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్' సేవా కార్యక్రమం



**నేటి సాక్షి, మెట్‌పల్లి, (రాధారపు నర్సయ్య):** అమావాస్య సందర్భంగా 'అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్' అధినేత పుల్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాన్ని మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి తన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. సమాజంలో ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం అత్యంత గొప్ప సేవా కార్యక్రమమని, ఇలాంటి కార్యక్రమాలు సేవాభావాన్ని పెంపొందిస్తాయని కొనియాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు మరియు అవసరమైన వారికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేయగా, స్థానికుల నుండి మంచి స్పందన లభించింది. నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా తమ ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్ల జగన్, కోట కిరణ్, బండారి శివ, తాటిపాముల నాగ లక్ష్మీపతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అన్నప్రసాద వితరణ



**నేటి సాక్షి, కోరుట్ల, (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో గల శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించబడింది. అన్నపూర్ణ అమావాస్యను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ సేవలో సుమారు 1000 మందికి పైగా భక్తులు, 150 మంది హనుమాన్ దీక్షాపరులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి ముందు దివాకర్ శర్మ ఆధ్వర్యంలో గోపూజ, అన్నపూర్ణ మాత పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. 'ఎవరూ ఆకలితో ఉండకూడదు' అనే సంకల్పంతో అమావాస్య రోజున పితృదేవతల తృప్తి కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, తెడ్డు శ్రీజ విజయ్, సమితి అధ్యక్షుడు మంచాల జగన్, కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, కమిటీ చైర్మన్ వనపర్తి చంద్రమోహన్, మంచాల రమేష్ మరియు సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ వాహనం ప్రారంభం



**నేటి సాక్షి, జోగులాంబ గద్వాల:** జిల్లా కేంద్రంలోని అక్షర టీవీఎస్ షోరూంలో కేటిదొడ్డి మండల బిఆర్ఎస్ నాయకులు కొండాపురం గాజుల కృష్ణ రెడ్డి కొనుగోలు చేసిన నూతన ఎలక్ట్రికల్ వాహనాన్ని బాసు హనుమంతు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు పార్టీ నాయకులు, మిత్రులు కృష్ణ రెడ్డికి స్వీట్లు తినిపించి అభినందనలు తెలియజేశారు.

# అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్న మహిళా సర్పంచ్

**నేటి సాక్షి, తిరుమలాయపాలెం,( మెట్టు రుద్రరాజు):** మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాదని, సంకల్పం ఉంటే రాజకీయం మరియు గ్రామ అభివృద్ధిలోనూ రాణించగలరని ఎర్రగడ్డ గ్రామ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నిరూపిస్తున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన ఆమె, తన మామ గారైన నల్లమల్ల ప్రతాప్ గారి సహకారంతో పదవి చేపట్టిన నాటి నుండి గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. గ్రామంలోని ప్రధాన సమస్యలను గుర్తించి, వాటిని దశలవారీగా పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో గత కొన్నేళ్లుగా వేధిస్తున్న మంచినీటి సమస్యకు ఆమె శాశ్వత పరిష్కారం చూపారు. వీటితో పాటు డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడం, ఉపాధి హామీ పనులు, వీధి దీపాలు, పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ గ్రామాన్ని జిగేల్మనిపిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' గ్రామ అభివృద్ధికి ఎంతో దోహదపడుతోందని తెలిపారు. పారిశుద్ధ్య మరియు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ఎర్రగడ్డను జిల్లాలోనే ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. గ్రామస్తుల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఈ సందర్భంగా వెల్లడించారు.



# గుల్లకోట పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు




**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల పరిధిలోని గుల్లకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉగాది పండుగ ముందస్తు వేడుకలను ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు ప్రకృతిలో వచ్చే మార్పులతో పాటు నూతన ఆశలు, ఆశయాలతో జరుపుకునే పండుగ ఉగాది అని వివరించారు. తీపి, పులుపు, కారం, ఉప్పు, చేదు, వగరు వంటి షడ్రుచులతో చేసే ఉగాది పచ్చడి, జీవితంలోని కష్టసుఖాలను సమదృష్టితో స్వీకరించాలని సూచిస్తుందని, ఇది ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని రాజిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు శ్రీ రంగాచార్యులు పంచాంగ శ్రవణం నిర్వహించి, ఉగాది పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరిస్తూ మంత్రోచ్చారణ గావించారు. అనంతరం విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి, అందరికీ "పరాభవ" నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు ఎస్. రమాదేవి, ఆర్. మాలతి, ఎన్. శ్రీలతతో పాటు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైస్ మిల్ పనులను మొదలెట్టండి



- రోడ్డుపై బైఠాయించి చిన్నమెట్‌పల్లి రైతుల ఆందోళన
- అప్పుడు గీత కార్మికుల నిరసనతో నిలిచిన పనులు..
- ఇప్పుడు ఆపిన పనులు ప్రారంభించాలని రైతుల డిమాండ్

**నేటి సాక్షి, కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** "రైస్ మిల్లు నిర్మిస్తే..మేం ఉపాధి కోల్పోతాం.. పనులు ఆపండని మొన్న 'గీతాకార్మికులు' రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.దీంతో పనులు ఆగిపోయాయి.ఇప్పుడు అదే రోడ్డుపై రైతులు ముందుకొచ్చి ఆపేసిన పనులు మొదలెట్టి రైస్ మిల్లు నిర్మించాల్సిందేనంటూ బైఠాయించిన వైనం చర్చానీయాంశమైంది.!

### ఉద్రిక్తత పరిస్థితుల మధ్య...

కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి గ్రామశివారులో నిర్మాణంలో ఉన్న రైస్ మిల్ పనులు నిలిచిపోవడంతో ఈసారి రైతులు రోడ్డెక్కారు. వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బైఠాయించడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### రైతుల బైఠాయింపు..

చిన్నమెట్‌పల్లి గ్రామశివారులో నిర్మాణంలో ఉన్న రైస్ మిల్ పనులు గత కొన్ని రోజులుగా నిలిచిపోయాయి. దీంతో ఆగ్రహించిన రైతులు రోడుపైకి వచ్చి బైఠాయించారు. పంటలను సమయానికి అమ్ముకునేందుకు రైస్ మిల్ అవసరమని, ఆలస్యం వల్ల తమకు నష్టం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### గీత కార్మికుల నిరసన ప్రభావం

ఇటీవల గీత కార్మికులు రైస్ మిల్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. మిల్ నిర్మాణం వల్ల తమ కులవృత్తికి నష్టం జరుగుతుందని వారు ఆరోపించారు. ఈ నిరసనల కారణంగా వారం రోజులుగా నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి.ఒకవైపు గీత కార్మికులు, మరోవైపు రైతులు భిన్నాభిప్రాయాలతో నిలబడటంతో గ్రామంలో ఉద్రిక్తతలు పెరిగాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తుడు రాజరెడ్డి మాట్లాడుతూ..'రైతులకు రైస్ మిల్ ఎంతో అవసరం. పనులు నిలిపివేయడం వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని సమస్యకు త్వరగా పరిష్కారం చూపాలి' అని కోరారు.!

# బడ్జెట్‌లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలి

- కంచర్ల రవి గౌడ్ డిమాండ్

**నేటి సాక్షి, సిరిసిల్ల , (శివకుమార్):** రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కనీసం లక్ష కోట్లు కేటాయించాలని కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో భారీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారం చేపట్టాక బీసీలను పూర్తిగా విస్మరించిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. హామీలు ఇచ్చి ఇప్పుడు పట్టించుకోకపోవడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బీసీ వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేశారని, ఎన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతోందని, నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. బీసీలు బిచ్చగాళ్లు కాదని, తమకు రావాల్సిన హక్కు వాటాను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి బడ్జెట్‌లో బీసీలకు భారీగా నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్, అరెవెల్లి వినయ్ కుమార్, నవీన్, విష్ణు, షాద్ శేఖర్, జుమీర్, రమేష్, అజిత్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## పెద్దకొండామర్రిలో 'రైతన్న మీకోసం' వారోత్సవాలు

**ఆరుతడి పంటలే శ్రేయస్కరం**



**నేటి సాక్షి, చౌడేపల్లి:** చౌడేపల్లి మండలంలోని పెద్దకొండామర్రి గ్రామంలో బుధవారం 'రైతన్న మీకోసం' వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మార్చి 16 నుండి 25 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ శివ శంకర్ మరియు పుంగనూరు ఏడీఏ శివకుమార్ రైతులకు సాగు పద్ధతులపై కీలక అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గడమే కాకుండా, నేల మరియు నీటి కాలుష్యాన్ని అరికట్టవచ్చని వారు వివరించారు. భూగర్భ జలాలను పొదుపుగా వాడుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. 'ఎల్ నినో' ప్రభావం వల్ల రాబోయే ఖరీఫ్ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు బోరుబావుల కింద వరి సాగును తగ్గించి ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. అన్నదాత సుఖీభవ, పీఎం-కిసాన్, కిసాన్ డ్రోన్లు మరియు సబ్సిడీ విత్తన పంపిణీ వంటి ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు తమ మొబైల్‌లో APAIమీ 2.0' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా భూమి వివరాలు, వాతావరణం మరియు మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.మోహన్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జయంతి, రైతులు చంద్రమౌళి, రామకృష్ణా రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కరీం సేవలుఅభినందనీయం

**పదోన్నతిపై ఆల్ మేవా ప్రతినిధుల హర్షం**



**నేటి సాక్షి, ఆత్మకూరు :** ఆత్మకూరు పట్టణ సబ్ రిజిస్ట్రార్ కె. అబ్దుల్ కరీం గ్రేడ్ -II నుండి గ్రేడ్-I అధికారిగా పదోన్నతి పొందిన సందర్భంగా ఆత్మకూరు డివిజన్ ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) ఆధ్వర్యంలో బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. విధుల్లో నిష్ఠతో సేవలు అందిస్తూ ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయమని అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని కీలక బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆల్ మేవా నాయకులు షేక్ సాజిద్ భాషా, నూర్ మొహమ్మద్, సయ్యద్ ఉమర్, మణియార్ మున్వర్, మహమ్మద్ గౌస్, ఎం.ఎస్.కె. షఫీ, అబ్దుల్ వాహిద్, ఖాజా, ఇర్ఫాన్ వలి, అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు. అబ్దుల్ కరీంకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమం పట్ల సబ్ రిజిస్ట్రార్ సంతోషం వ్యక్తం చేస్తూ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మెరిసిన విద్యాకుసుమం

**నవోదయలో ర్యాంకు సాధించిన గౌరీనాథ్**



**నేటి సాక్షి, బుగ్గారం:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి నక్క గౌరీనాథ్ నవోదయ ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ చాటారు. ఇటీవల విడుదలైన నవోదయ ఫలితాల్లో గౌరీనాథ్ (తండ్రి శంకర్) అత్యుత్తమ ర్యాంకు సాధించి, ప్రతిష్టాత్మకమైన నవోదయ పాఠశాలలో సీటు ఖరారు చేసుకున్నారు. కళ్యాణి పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి, కఠినమైన పోటీని ఎదుర్కొని ఈ ఘనత సాధించడంపై స్థానికులు మరియు విద్యావేత్తలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ రహమాన్ విద్యార్థి గౌరీనాథ్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. క్రమశిక్షణతో కూడిన చదువు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే ఈ విజయానికి కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు నక్క శంకర్ - లేహ, ప్రిన్సిపాల్ పంజాల తిరుపతి, ఉపాధ్యాయ బృందం మరియు తోటి విద్యార్థులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థి ఇలాంటి జాతీయ స్థాయి విద్యా సంస్థలో సీటు సాధించడం పట్ల బుగ్గారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్‌లో ఉగాది సంబరాలు

నేటి సాక్షి, గజ్వేల్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో ఉగాది పండుగ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రీ-ప్రైమరీ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సంప్రదాయబద్ధంగా ఈ వేడుకలను జరుపుకున్నారు. చిన్నారులు అందరూ సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ఆవరణ అంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా హాజరైన పాఠశాల ప్రిన్సిపల్ విజయ్ పాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉగాది పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు జీవితంలో ఎదురయ్యే సుఖదుఃఖాలను సూచిస్తాయని, వాటిని సమానంగా స్వీకరిస్తూ విద్యార్థులు కొత్త ఆశయాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు చిన్నారులకు పండుగ విశిష్టతను కథలు, పాటల ద్వారా వివరించగా, విద్యార్థులు ఉగాది పచ్చడి తయారీ ప్రక్రియను ఎంతో ఆసక్తిగా గమనించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నచిన్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ




ఆకట్టుకున్నాయి. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, తల్లిదండ్రులు మరియు గురువులను గౌరవిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు. పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రుల సమక్షంలో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది

# ఆసిఫాబాద్‌లో రహదారిపై ప్రజల గర్జన



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ పట్టణ కేంద్రంలోని సాయి బాబా ఆలయం నుండి లింకేజీ రోడ్డు ద్వారా జాతీయ రహదారి గుండి వైపు వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

- **గుంతలమయమైన రోడ్డుతో ధర్నా**

ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో, ఆగ్రహించిన పట్టణ ప్రజలు బుధవారం రోడ్డుపై బైఠాయించి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ, గుంతల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు దెబ్బతినడమే కాకుండా పాదచారులు నడవడానికి కూడా వీల్లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే స్పందించి కొత్త రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి తక్షణ చర్యలు తీసుకోకపోతే, తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# వందేమాతరం గేయం పట్ల అవమానం

- **గజ్వేల్‌లో బీజేపీ నిరసన జ్వాలలు**

**నేటి సాక్షి, గజ్వేల్:**తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో వందేమాతరం గేయం ఆలపిస్తున్న సమయంలో కొందరు సభ్యులు వాకౌట్ చేసిన ఘటనపై బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ చర్యను నిరసిస్తూ గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నిరసనకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ వంటి పవిత్ర వేదికపై జాతీయ గేయమైన వందేమాతరాన్ని అవమానించడం దేశానికి, రాజ్యాంగానికి తీరని ద్రోహమని మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హిందూ సంప్రదాయాలు, ఆలయాలపై దాడులు జరుగుతున్నా



ప్రభుత్వం మౌనంగా ఉండటం శోచనీయమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ఎంఐఎం పార్టీతో చేతులు కలిపి పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

# హక్కులు అడిగితే అరెస్టులా..



- జిల్లా కార్యదర్శి ముశం రమేష్ సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భారీ నిరసన
- గ్రామ పంచాయతీ కార్మికుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించిన రమేష్
- మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్
- హామీలు నెరవేర్చకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక

**నేటి సాక్షి, సిరిసిల్ల ( శివకుమార్):** హక్కుల కోసం పోరాడుతున్న గ్రామపంచాయతీ కార్మికులపై అక్రమ అరెస్టులు, నిర్బంధాలు ప్రయోగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్ తీవ్రంగా ఖండించారు. 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళ్తున్న కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ, గురువారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముశం రమేష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. కనీస వేతనం అమలు, మల్టీపర్పస్ విధానం రద్దు వంటి హామీలు నేడు 'నీటి మూటలు'గా మిగిలిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా వేతనాలు అందక గ్రామపంచాయతీ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, కుటుంబాలను పోషించుకోలేక అప్పుల ఊబిలో కూరుకుపోయి పస్తులుంటున్నారని తెలిపారు. శాంతియుతంగా తమ సమస్యలను విన్నవించుకోవడానికి వెళ్తున్న వారిని దుర్మార్గంగా అరెస్టు చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అరెస్టు చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎలిగేటి రాజశేఖర్, యూనియన్ నాయకులు బోరా శ్రీనివాస్ గౌడ్, గూడెం శీను, అంజయ్య, అల్గోజి మల్లయ్య, శ్రీనివాస్, రాజు, శంకర్, లక్ష్మి, మల్లవ్వ, రవి తదితరులు పాల్గొన్నారు.